# స్పృహ

హృదయం సంపెంగ పొద
బాధ మహా సర్పమై పడగ ఎత్తుతోంది
వాన గాలికి కరుణ లేదు
ఒంటరితనాన్ని ఆట పట్టిస్తోంది
- రాసిన వాక్యాల మీద కాలుస్తున్న సిగరెట్‌ని నొక్కాడు.

''ఏమయింది నా కవిత్వం?''

బిగ్గరగా అరిచాడు శేఖరం.

అతనున్న గదిలోని ఏర్ కండిషనర్‌గానీ, మంచాలూ, దిళ్ళూ, టేబిలూ, కుర్చీలూ, వార్డ్ రోబూ, తివాసీలుగాని... జవాబివ్వలేదు.

కళ్ళు మూసుకుంటూ చేతిని మొహంమీద పెట్టుకుని కుర్చీలో వెనక్కి వాలాడు. చేతికి వున్న వాచీ గొలుసు గుచ్చుకుంది. అసంకల్పితంగా కళ్ళు విప్పి వాచీని పరిశీలించాడు. స్నానం చేస్తున్నప్పుడు వాచీ తీయలేదా?

అలాగే వుంది - అనుకుంటూ తనని తాను తిట్టుకున్నాడు. బొచ్చు తువ్వాలుతో వాచీని, మెడలోని పులిగోరునీ ఒత్తాడు.

ఛాతీ మీద వెంట్రుకలు లేవు. నున్నగా వుంది. పచ్చగా వుంది. దాని మీద ఆ గొలుసుని చూస్తుంటే చిత్రమైన గర్వం శేఖరంలో మెరిసింది. అప్రయత్నంగా కలిగే ఆ గర్వం ఈనాటిది కాదు.

తన శరీర ఛాయను అతను - తెలుపు అంటాడు. ప్రపంచంలో తెలుపు రంగు వాళ్ళే తతిమ్మా అన్ని రంగుల వాళ్ళనీ పరిపాలించగలిగారని కూడా అతను అంటాడు. తెలుపు రంగు కారణంగా ప్రపంచాన్ని పాలించగలిగే శక్తి తనకు పుట్టుకతో వచ్చిందని అందరూ అనుకోవాలని శేఖరం లోపల్లోపల అనుకునేవాడు.

''తెల్లగా వుండటాన్ని అందరూ అందంగా భావిస్తారు'' అని స్నేహితులతో అనేవాడు.

''అందంగా వున్నవాళ్ళకు అదనపు బాధ్యతలు వున్నాయి. ఎదుటివారి శీలాన్ని కాపాడటం వాటిలో ముఖ్యమైనది'' అనే తన మనసులో మాటను కూడా స్నేహితులతో అనేవాడు.

చాలామంది ఊరుకున్నారు. ఒక స్నేహితుడు విని, విని ఒకమారు అన్నాడు.

''నేను నీతిగా వుండాలి. ఎదుటివారి నీతిని కాపాడాలి - అని నువ్వు అనుకోడానికి నాకెలాంటి అభ్యంతరమూ లేదు. కాని - ఆడవాళ్ళందరూ నీ వెంట పడతారని నువ్వింత గట్టిగా నమ్మడం అసహ్యంగా వుంది. ఇంతకీ శేఖరం - నువ్వు నీతిగా వుండాలని గట్టిగా అనుకుంటున్నావా? - అందరూ నీ వెంట పడాలని గట్టిగా ఆశిస్తున్నావా? ముందీ విషయం తేల్చు'' అని నిలదీశాడు ఆ స్నేహితుడు.

అప్పటికి శేఖరం డిగ్రీ చదువులో వున్నాడు. తనకున్న కొద్దిపాటి జీవితంలోని కొద్దిపాటి అనుభవాన్నుంచి అతను తయారు చేసుకున్న సిద్ధాంతాన్ని సులువుగా చెప్పగలిగాడు. అయితే - అంత సులువుగా - తన అనుభవాన్ని ఆ స్నేహితుడికే గాదు- ఏ స్నేహితుడికీ శేఖరం చెప్పలేకపోయాడు.

ఆ స్నేహితుడి ప్రశ్న అతనిలో చాలా ప్రకంపనాలు సృష్టించింది. చివరికి మనసులో మాట ఎవరికీ చెప్పరాదన్న నిర్ణయం తీసుకున్నాడు.

శేఖరంలో ఆ గర్వం వెనుకే కదలాడే ప్రశ్నలూ, భావనలూ, జ్ఞాపకాలూ అనంతం.

'-సామాజిక జీవితంలో యిన్ని రహస్య కోణాలు లేకపోతే ఎంతమందికి ఈ అవాంఛనీయ భారాల మోత తప్పి వుండేది!!' అనుకున్నాడు శేఖరం.

ఫోన్ మోగసాగింది.

పత్రిక ఏజంట్.

స్టేషన్‌కి కారుని పంపాడు. హోటలులో దించాడు. క్షేమ సమాచారాలు అడుగుతున్నాడు. మర్నాడు వీలు చూసుకుని తనని కలియమని కోరుతున్నాడు.

యథాలాపంగా జవాబులు యిస్తూ బయటకి చూశాడు శేఖరం.

అద్దాల తలుపు మీద మొత్తుకొంటోంది వాన.

తనను మనిషి జయించాడన్న ఉక్రోషమా - తనకు దూరమయ్యాడన్న దుఃఖమా - ఈ వానకు?

ఫోన్ పూర్తయింది. ఏసీ తగ్గించాడు. విశాలమైన అద్దాల మీద తెరలను మరికొంత తొలగించాడు. కొంచెం సేపు చూసి అద్దాల తలుపులను తెరిచాడు. నిలువెత్తు తలుపులు మెత్తగా

తెరచుకున్నాయి.

వాన లోపలికి వచ్చి మొహాన్ని తడిపింది.

పల్లెటూరిలో - తాటాకు యింటిలో మట్టి అరుగుని పొక్కిస్తూ - వచ్చేది వాన!

అడవిలో - మోస్తున్న తుపాకీనీ తననీ కలిపి చుట్టుముట్టేది వాన!

ఆ వానలకీ, ఈ ఖరీదయిన హోటల్ ఎనిమిదవ అంతస్తులోని ఈ గదిలోకి ఎంత రానిస్తే అంతవరకూ మాత్రమే వచ్చే ఈ వానకీ ఎంత తేడా! - లెక్కలు వేస్తోంది శేఖరం మెదడు.

తెరిచిన తలుపులోంచి సులువుగా బయటికి పోగలవురా -- అంటోంది మనసు.

ఏం జరుగుతుంది?

తల 'భళ్ళు'మంటుందా? 'ఫటిల్లు'మంటుందా?

ఆ రెండు 'పదా'లలో ఏది వాడాలన్నది విలేఖరుల సమస్య.

ఏం రాస్తాయి పత్రికలు?

'ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధ తెలుగు వార, మాసపత్రిక ''ప్రకాశం'' సంపాదకుడూ, బిజినెస్ మానేజరూ హోటలు గది కిటికీలోంచి పడి దుర్మరణం' అని రాస్తాయా పత్రికలు?

ఛ! అంత పాడుగా రాస్తే ఏం నప్పుతుంది?

'ప్రకాశం ప్రకాశం ఆరిపోయింది'

'బెంగుళూరు మింగిన ప్రకాశం'

దినపత్రికలలో యీ హెడ్డింగులు బానే వుంటాయి. కొంచెం కవిత్వం, కొంచెం సస్పెన్సు!

అయితే యిది హత్యా? ఆత్మహత్యా? దుర్మరణమా? అన్న ప్రశ్న ఆ వార్తలో తప్పకుండా వుంటుంది. దాని మీద ఎవరో ఒక పోలీసు అధికారి అభిప్రాయాన్ని - అతనేదో సర్వాంతర్యామి - అన్నట్లు విలేఖరులు ప్రశ్నిస్తారు.

తనయితే అక్కడితో ఆగడు.

ఒక సంపాదకుడికి - విజయాన్ని సాధించదలుచుకున్న వానికి - ఆ మరణం ఒక 'సరుకు'. అందులో బోల్డంత మసాలా కూరి అమ్మవచ్చు. కొద్దిగా స్త్రీ విషయాన్ని కూడా జొప్పించితే మరింత 'విలువ' పెరుగుతుంది.

ఒక మనిషి 'శేఖరం' చావు అనుపయోగం. ఒక పెద్ద వ్యాపార సంస్థ తీసుకువస్తున్న ప్రసిద్ధ పత్రిక ''ప్రకాశం'' సంపాదకుడి మరణంలో - అమ్మగలిగితే - లాభాలు బాగానే వుంటాయి.

తలుపు మూసేసాడు శేఖరం.

వణుకుతున్న చేతులతో మొహాన్ని మూసుకున్నాడు. అలాగే కుర్చీలో కూర్చుని సిగరెట్ తీసి వెలిగించాడు. దృష్టి మళ్ళటానికి టేబిల్ మీది పుస్తకాన్ని తీసాడు.

అది ఎ4 సైజు కాగితాలతో తయారు చేయబడిన లెటర్ పాడ్. దాని మీద యింగ్లీష్‌లో ముద్రించిన తన పేరూ, పదవీ, పత్రిక పేరూ, ఫాక్స్, యీ-మెయిలూ, ఇంటర్నెట్‌లో చిరునామా

వగైరా వివరాలు ముద్రించబడి వున్నాయి.

కొంచెం వణుకు తగ్గినట్లయింది.

దాని మీద రాస్తూ రాస్తూ విడిచి పెట్టిన 'కవిత్వం' లాంటి అక్షరాల మీద చూపులు పరుగెత్తాయి.

సిగరెట్ వేసి నొక్కిన చోట చిన్న కంత.

అక్కడ ఏ పదం వుండాలి?

వానగాలికి... లేదు.

ఏం రాసాడు?

కరుణ. కరుణ. కరుణ. బెంగుళూరు.

శేఖరం మెదడు కాలిన పదం నుంచి దాగిన 'కరుణ' జ్ఞాపకం కోసం తన్నుకోసాగింది.

క్రమంగా కరుణను కలిసిన సందర్భం, ఆమె మాటలూ అతను జ్ఞాపకముంచుకున్న విధంగా జ్ఞాపకం రాసాగాయి.

★★★

అది హైదరాబాద్.

స్త్రీ వాదులు నిర్వహిస్తున్న సమావేశం అది. సరస్వతి అధ్యక్షురాలు. పని మీద విజయవాడ నుంచి హైదరాబాదు వెళ్ళాడు. సరస్వతి కలిసి తనని కూడా మీటింగ్‌కి రమ్మంది.

శేఖరం దృష్టిలో–

సరస్వతి చాలాకాలం ప్రమాదం లేని సాహిత్యం సృష్టించింది. దాంతో కొంత పేరూ వచ్చింది. కొంత డబ్బూ చేసుకుంది. ఆవిడకి వయసు మళ్ళింది. దాంతో – అంత ప్రమాదం వుండదులే – అని భావించి – కాస్తంత ప్రమాదకరమైన సాహిత్య సృష్టికి దిగి – మరో రకమైన పేరు తెచ్చుకుంది.

సరస్వతి పిలుపుని శేఖరం తిరస్కరించలేదు.

ఆ సమావేశం ఏర్పాటు చేసిన స్థలం ఓ మోస్తరు గది. చిక్కడపల్లిలో మేడ మీద ఎవరిదో ఒకరి యింటి వాటా. కాస్త విశాలంగానే వుంది. దానిలో కొద్దిపాటి కుర్చీలూ, చాపలూ వున్నాయి. దాదాపు యిర్వై మంది వున్నారు. అందులో శేఖరం కాక మరో యిద్దరు మగవాళ్ళున్నారు.

శేఖరానికి ఒక కుర్చీ ఖాళీ చేయించి యిచ్చింది సరస్వతి. ''మరీ యిలాంటి చోట సమావేశం పెడతారనుకోలేదండి. మిమ్మల్ని యిబ్బంది పెట్టాను'' అంది సరస్వతి కాస్త రహస్యంగా.

సమావేశం మొదలయింది.

అందులో కరుణ మాట్లాడింది. వాదనా తీవ్రతతో ఆమె కళ్ళు మరింత పెద్దవయాయి.

''–స్త్రీల మీద పురుషుల ఆధిపత్యాన్ని కొనసాగించే ఆయుధాలతో అతి ప్రధానమైనదీ, శక్తివంతమైనదీ లైంగిక నీతి. దానిని మనసా, వాచా, కర్మేణా స్త్రీ నమ్మటం మీదనే – ప్రస్తుత వివాహ వ్యవస్థ – ఆధారపడి వుంది. ఆ వ్యవస్థని ఒక బలమైన వలలా తయారుచేసి పురుషుడు

స్త్రీలను తన క్రింద అణిచిపెట్టి వుంచగలుగుతున్నాడు. పరమ పవిత్రమని వాగే దేవాలయ వ్యవస్థని సహితం తన లైంగిక వాంఛల కోసం వాడుకున్న పురుషుడు వివాహ వ్యవస్థని నిర్లజ్జగా వుపయోగించుకున్నాడు. 'నువ్వు నీతి తప్పకు. వంశం కలుషితమవుతుంది. సమాజం భ్రష్టమవుతుంది. నాగరికతలు నాశనమవుతాయి. సంస్కృతి సమూలంగా ధ్వంసమవుతుంది' అని స్త్రీకి నయానా, భయానా చెప్పాడు. రాజ్యాన్నీ, ప్రభుత్వాన్నీ తనకు అనుకూలంగా మలుచుకున్నాడు పురుషుడు.

''ఆధునిక పురుషుడు కూడా ఆ ప్రధాన ఆయుధాన్ని విడిచిపెట్టలేదు. చిన్ని చిన్న మార్పులతో ఆ ఆయుధాన్ని మెత్తని కత్తిగా తయారు చేసుకున్నాడు.

''నేను నీతిగా వుంటాను. కనక, నువ్వూ నీతిగా వుండాలి'' ఇదో వాదం.

''నీతిగా వుండేవారు వేరు. ఉండని వారు వేరు. అందులో పురుషులూ వున్నారు - స్త్రీలూ వున్నారు. అయితే సమాజంలో ఏ కాలంలోనయినా నీతిపరులే హెచ్చు'' ఇది మరో వాదం.

ఇలాంటివే మన చుట్టూ అనేకానేక వాదాలు.

వాటిని విడివిడిగా చూస్తే మనం ఒకదాన్ని తెంచుకుని మరో దానికి బంధించబడిపోతాం.

''ఈ లైంగిక నీతి అనేది - ఏ విధంగా చూసినా - అనేక యితర నీతులలాగే కేవలం వ్యక్తిగతం. అది సమాజ నిర్మాణానికి పునాది రాయి అని చెప్పి ఒప్పించడమూ సులువే! అది స్త్రీ పురుషులు యిద్దరూ కలిసి పాటించేవారని చెప్పినా, ఇద్దరూ కలిసి యిప్పుడూ ఎప్పుడూ పాటించాలని చెప్పినా - అది ఎంతో సమంజసంగా అందంగా కనిపిస్తుంది.

కాని -

శతాబ్దాలుగా - సమానంగా జీవించని రెండు సమూహాల మధ్య... మానసికంగా ఎదగటానికి సమాన వాతావరణం లభించని రెండు సమూహాల వారసుల మధ్య... బలవంతంగా చేయిస్తున్న పరుగు పందెం ఈ లైంగిక నీతి. ఈ చిత్రమైన పందెంలో - తమాషా ఏంటంటే - దీన్ని నిర్వహించే పురుషుడూ, దీనిలో యిచ్ఛాపూర్వకంగా పాల్గొనే పురుషుడు కూడా - బలవంతంగా యిందులోకి ఈడవబడిన స్త్రీయే - గెలవాలని కోరుకోవటం.

వాళ్ళ పందానికీ, కోరికకీ వాళ్ళని వదిలేసి మనం మాత్రం ఈ లైంగిక నీతికి నీళ్ళొదిలేద్దాం! దీనిని మనం నమ్మకపోతే ఈ సమాజం సర్వనాశమై పోతుందని, ఈ భూమి బద్దలై పోతుందనీ ఎవరైనా వాపోతే, వాపోనివ్వండి! మనం ఆ సర్వనాశనమేదో చూద్దాం! ఇన్ని శతాబ్దాలుగా లైంగిక నీతిని పాటించకపోవటం వల్ల - పురుషులు చేయలేకపోయిన సర్వనాశనమేదో - ఈనాడు మనలాంటి కొద్దిమంది స్త్రీలు నమ్మకపోవడం వల్ల జరిగితే - అప్పుడయినా మన ఆధిక్యత - యీ శవాల గుట్టలకు బోధపడుతుంది-''

శేఖరం ఆమె కళ్ళనే చూస్తున్నాడు. అవి మెరుస్తున్నాయి. అతనికి ఆ మెరుపు గుర్తుండిపోయిందో - ఆమె వాదన గుర్తుండి పోయిందో - యిప్పుడు ఏ మాత్రమూ తేల్చుకోలేని విషయాలు.

గుర్తున్నదేంటంటే -

ఆమె ప్రసంగిస్తున్నపుడు, అప్రయత్నంగా జేబులోంచి సిగరెట్ తీసి వెలిగించడం. కరుణ ప్రసంగాన్ని ఆపి, అతని వయిపు చురుగ్గా చూస్తూ -

''ఓ మర్యాదస్తుడా! నువ్వు సృష్టించే పొగ నీ మగతనానికీ, మర్యాదకూ కలికితురాయి కావచ్చు. అది ఈ గదిలో వున్న చాలా మందితో బాటు నాకు అసహ్యం కలిగిస్తోంది.''

చటుక్కున సిగరెట్‌ని ఆర్పేసాడు.

ఆమె మాటలు యథాతథంగా గుర్తున్నాయి. అందుకు కారణం ఆ మాటల్లోని కృతకత్వం. ఆ కృతకత్వంలో ఆమె అసహ్యం బాగా పలికిందని అతనికి అప్పుడే అనిపించింది. అది కూడా అతనికి ఆకర్షణీయంగానే అనిపించింది.

అధ్యక్షురాలు సరస్వతి కంగారు పడింది - ''అమ్మాయ్! ఆయన ఎవరనుకుంటున్నావ్?''. అంది కాస్తంత కోపం జోడిస్తూ.

''- మామూలు మగాడనే అనుకుంటున్నాను. కాదంటే - చెప్పండి -'' అంది కరుణ.

వేలెడంత లేని ఆ అమ్మాయి మాటలకు సరస్వతికి మండే వుంటుంది. అయినా ఉద్రేక ప్రదర్శన వల్ల ప్రమాదం వుంటుందేమోననుకుంది గాబోలు, ఓపికగా అంది-

''ఆయన శేఖరంగారు. 'ప్రకాశం' పత్రికకు ఉప ముఖ్య సంపాదకుడు. తెలుగులో డాక్టరేట్ తీసుకున్నారు. ఎంబీయే కూడా చేసారు. ప్రయత్నించాలేగాని - ఏ పెద్ద కంపెనీ వాళ్ళయినా ఎగరేసుకుపోతారు. సాహిత్యం కోసం అంకితమైపోయి ఈ పత్రికా రంగంలో వుండిపోయారు. స్త్రీల పట్ల వారికి అపార గౌరవం. నువ్వు ఒక్కమారు ఆ పత్రిక తిరగేస్తే - నీకే తెలుస్తుంది. - స్రీ సమస్యలకు వారిచ్చే ప్రాధాన్యం, స్త్రీల పట్ల వారి సానుభూతీ...''

మధ్యలోనే అడ్డుపడింది కరుణ - ''మగాళ్ళ సానుభూతి కోసం మనం వెంపర్లాడనక్కరలేదు.''

''నువ్వు చెప్పింది నిజమే గాని - మన భావాలూ, వాదాలూ, పోరాటం ప్రపంచానికి తెలియాలంటే పత్రికల సానుభూతీ, ప్రోత్సాహం కావాలి కదమ్మా-'' కాస్తంత నచ్చజెపుతున్న ధోరణిలోనే అంది సరస్వతి.

''పత్రికల కన్న ముందు ప్రపంచంలో స్త్రీలు వున్నారు. వారు జీవించారు. మరణించారు. జీవించినంత కాలమూ అనేక విషయాల కోసం, అనేక విధాలుగా రోదించారు. అనేక సమస్యల బరువు కింద నలిగి, నలిగి మరణించారు. ఆ రోదనను, వేదననూ మనం ఈనాడు చర్చిస్తున్నాం! వాటి కొనసాగింపుని మనం యీనాడు ప్రశ్నిస్తున్నాం! ఆ సమస్యలను ఈ పత్రికలు సృష్టించలేదు. వాటి కొనసాగింపుని ఈ పత్రికలు ఆపలేవు. మన చర్చలూ, మన ప్రశ్నలూ వీటి అమ్మకాలకు సరుకులుగా పనికి వచ్చినంత కాలమూ యివి అమ్ముకుంటాయి. మన శరీరావయవాలను ఒక పేజీలో అమ్మకం పెట్టి, ఆ వెనుక పేజీలో మన ఆవేశోద్వేగాలనూ, ఆక్రోశాలనూ అమ్మకం పెట్టే పత్రికా వ్యవస్థ సానుభూతి కోసం మీరు యింతగా వణికిపోనవసరం లేదు-'' అంది కరుణ.

ఆ గది అంతా చప్పట్లతో నిండిపోయింది.

''మీరన్నదానిలో అసత్యమేమీ లేదు... కరుణా!''

శేఖరం మాటలకు ఆ గది మరింతగా చప్పట్లతో నిండిపోయింది.

సమావేశం ముగిసాక, సరస్వతి శేఖరం వద్దకు వచ్చింది. ఆమె ముఖం అప్రసన్నంగా వుంది. గొంతుకలో క్షమార్పణ వుంది.

''పదండి శేఖరంగారూ! మీ టైమూ, మూడూ పాడుచేసాను-'' అంది కిందకి దిగాక.

''అదేం లేదు-'' అన్నాడు శేఖరం.

సరస్వతి భర్త రాష్ట్ర ప్రభుత్వంలో పెద్ద అధికారి. ఆమె కోసం అధికార వాహనం ఎదురు చూస్తోంది. ఆ రాత్రి సరస్వతి యింట్లో శేఖరానికి ఆతిథ్యం.

''మీరు నాకో పని చేయగలరా?'' అన్నాడు శేఖరం కారులో కూర్చున్నాక.

''తప్పకుండానూ-'' అంది.

''ఒక్కమారు కరుణతో మాట్లాడాలనుంది - పిలుచుకు రండి!'' అన్నాడు.

''పిలుస్తానూ... నాకేం అభ్యంతరం లేదు. వస్తానంటే యింటికి తీసుకెళ్ళి యింత తిండి కూడా తినమంటాను. కానీ... ఆ పిల్ల మొండిదానిలా వుంది. ప్రయత్నిస్తాను-'' అంది.

కరుణతో సహా ఆమె తిరిగి వచ్చింది. వాళ్ళు వచ్చేముందే శేఖరం కారు దిగి, ఓ అడుగు వాళ్ళవేపు వేసి 'నమస్కారమండీ' అన్నాడు.

''నాతో ఏదో మాట్లాడాలన్నారుట-'' అంది. వీధి దీపాల మసక వెలుతురులో ఆమె మొహంలో భావాలు తెలియటం లేదు. గొంతుక మాత్రం మామూలుగా వుంది.

''నేనెందుకు సిగరెట్ ముట్టించానో చెప్పాలనీ...''

''క్షమార్పణ చెప్పాలని పిలిచారనుకున్నాను-''

''మీ కోపం న్యాయమైనదేగానీ, మీ ఆవేశం నాలో కలిగించిన స్పందన...'' అంటూ ఆగాడు. ''ఏమైనా అనుకోండి - మిస్ కరుణా! నేనెంత పత్రికా సంపాదకుడనైనా, ఎంత కవినయినా, కొత్త పదాలను సృష్టించలేను గదండి'' అన్నాడు ఉపోద్ఘాతంగా.

''మీరే పదాలు వాడినా... అర్థం చేసుకొనే శక్తి నాకుంది మారీడ్ శేఖర్!''

''ఈసారి నా అపరాధం ఏమిటీ?'' అన్నాడు.

''ఆడవాళ్ళకి మారీడ్ స్టేటస్ తగిలించకుండా మాట్లాడలేని మగాళ్ళకి - దాన్ని తగిలించడం నా పద్ధతి.''

నవ్వాడు శేఖరం. కరుణా మెల్లగా నవ్వింది.

''మీరు హైదరాబాద్‌లో ఎప్పుడూ తగలలేదు.''

''మనం బెంగుళూరులో తగుల్తాం-''

''పోనీ - బెజవాడ వస్తే మా ఆఫీసుకి రండి. స్టాండింగ్ ఇన్విటేషన్-'' అన్నాడు. తన విజిటింగ్ కార్డు యిస్తూ.

''ఎండలని ఎవరు కోరుకుంటారండి - మా బెంగుళూరు వస్తే మా యింటికి రండి-''

కరుణ చిరునామా చెప్పింది. ఎక్కడో రాసుకున్నాడు.

ఆరోజు సరస్వతి ఇంట్లో కూడా కరుణే విషయం అయింది.

''-ఈకాలం వాళ్ళకి మర్యాదలు తెలియవండీ! పెద్దా, చిన్నా తెలీదు. మిగిలిన పిల్లలని చూడండి - మీరు వస్తే ఎంత మర్యాదా - ఎంత మన్ననా! అసలు - శేఖరం గారూ - మీరే కదండీ - అక్షరం ముక్కరాని యీ పిల్లల్ని కవయిత్రులను చేసిందీ... రచయిత్రులను చేసిందీ-'' అంటూ ఆరంభించింది సరస్వతి.

''కరుణ ఏమైనా రాస్తుందా?'' అడిగాడు శేఖరం.

''సంస్కారం లేని మనిషి. ఏం రాస్తుందండి? రాసినా, ఎవరు వేస్తారండీ-'' అంది.

''రాతలో సంస్కారం తగ్గితే, వాడి పెరుగుతుంది'' శేఖరం.

కాస్త అయోమయంగా చూసింది సరస్వతి. అంతలోనే సర్దుకుని ''-నిజమేనండి! ఆ పిల్ల తెలివయినదాన్లాగే వుంది. నిజాయితీ కూడా వున్నట్టుంది. కాని - ఏం రాస్తుందో నాకు తెలీదు.''

''అసలు రాస్తుందా?''

''అంతకన్న యీ పిల్లలు ఏం చేస్తారండి - రాయడమే గదా!''

శేఖరం ఆమె నవ్వులో నవ్వు కలిపాడు.

సరస్వతి భర్త శేఖరానికి మందు ఆఫర్ చేసాడు. శేఖరం అలవాటు లేదన్నాడు. సరస్వతి మొహం యింత చేసుకుంది.

''నిజమైన ఫెమినిస్టు మీరే శేఖరం గారూ! తాగేవాళ్ళంటే అసహ్యించుకోని ఆడవాళ్లుండరు-'' అంది.

''-తాగనివాళ్ళంతా పెళ్ళాలను సుఖపెట్టేటట్టయితే - ప్రపంచంలో - ఫెమినిజం ఉండదు-'' అన్నాడు సరస్వతి భర్త.

''ఆ పిల్ల కరుణ అచ్చంగా మీలాగే మాట్లాడుతుంది.''

''ఏంటంటుంది?'' అన్నాడు శేఖరం.

''ఫెమినిజానికీ, తాగటానికీ సంబంధం లేదుట - అసలు ఫెమినిజానికీ, ఆడాళ్ళు బాధపడటానికీ సంబంధమే లేదుట-''

''ఎంచేతట?''

''బాధలు పడే ఆడవాళ్ళకు ఆ విషయం తెలియనే తెలియదుట - బాధలు పడుతున్నామనుకునే వాళ్ళు కూడా సంఘం చట్రాలలోనే తమ కోపాన్ని బయట పెట్టుకుంటారుట. గయ్యాళి వాళ్ళు అనిపించుకుంటారుట.''

సరస్వతికి అర్థమయినదేదో తనకు నచ్చిన పద్ధతిలో చెపుతూనే వుంది. ఆమె భర్త తన గదిలోకి వెళ్ళగానే సరస్వతి అంది.

''మీరెన్ని చెప్పండి - ఆ పిల్ల బుద్ధులు సరయినవి కావు. విన్నారు గదా - ఇందాకా ఆ పిల్ల మాటలు! అలాంటివి వింటే మా ఆయన లాంటి వాళ్ళకి ఎట్టాంటి బుద్ధులయినా పుడతాయి-''

అంతటితో కరుణను విడవలేదు శేఖరం.

విజయవాడ వస్తూనే లక్ష్మణరావుని ప్రశ్నించాడు.

''కరుణ ఎవరు?''

రాస్తూ వున్న పెన్నుని మూసి టేబిల్ మీద వుంచి, వేళ్ళని విరుచుకుంటూ, ఆవులించుతూ శేఖరం వయిపు చూసాడు రావు.

ఆ తర్వాత అతని జీవితాన్ని మరోమారు అస్తవ్యస్తం చేసిన లక్ష్మణరావు - అప్పట్లో అతని రూమ్‌మేట్. అప్పటికి వాళ్ళిద్దరూ రెండేళ్ళ పైగా కలిసి వుంటున్నారు. వాళ్ళిద్దరి అనుబంధానికీ కొంత ప్రాచుర్యం వుంది.

శేఖరం దృష్టిలో -

లక్ష్మణరావు ఎగ్రెసివ్. ఇంజనీరింగ్ కాలేజీలో చదువు చెప్పటానికి అంత ప్రసిద్ధుడు కాదు. రచయితలనూ, కవులనూ వాళ్ళ సైజుకి కత్తిరించే విమర్శకునిగా ప్రసిద్ధుడు. అభ్యుదయ దృష్టిని ప్రసాదిస్తాడు.

సాహిత్య దేవాలయంలో విమర్శకు ప్రత్యేక పీఠం ఏర్పరుస్తున్నాడని... ఓ కవి లక్ష్మణరావు సన్మాన సభలో ఛందోబద్ధ పద్యాలతో పొగిడాడు. అయినప్పటికీ, ఆ కవిని రావు విడిచిపెట్టలేదు. ''పద్యం ఫరవాలేదు. వస్తువు మంచిది. ఏం ప్రయోజనం - వస్తువుకి తగ్గ వాహనం వుండాలన్న ప్రాథమిక విషయం ఈ కవికి తెలియలేదు. ఇటువంటి పని చేసినందుకే - ఒక ఆంగ్ల కవిని ప్రసిద్ధ విమర్శకులు గుర్తించలేదు'' అని మందలించాడు. ఆ ఆంగ్ల కవి ఎవడు? ఆ విమర్శకులు ఎవరు? అనే ప్రశ్న ఎవరూ వేయలేదు.

అతని సాహితీ ప్రక్షాళనకు వేదికనిచ్చింది ఎవరు? తనే! కాని... అటు లోకంగానీ, యిటు రావుగానీ... దానిని గుర్తించారా? రావు కృతజ్ఞత చూపాడా?

శేఖరంకి ఆనాటి దృష్టి ఏదయినా - వారిద్దరి మధ్యా గట్టి అనుబంధమే వుండేది. అంత అనుబంధమున్నా - శేఖరం ప్రశ్నకు లక్ష్మణరావు వెంటనే జవాబు చెప్పలేదు.

ఎందుచేతనంటే - ఆ ప్రశ్న అంత తేలికయినది కాదు. 'ఫలానా వాళ్ళు ఎవరు?' అన్న పృచ్ఛకుడి చరిత్రా, సామాజిక స్థానమూ, ఔద్యోగిక స్థానమూ... ప్రశ్నిస్తున్నప్పటి స్వరమూ అతని సాధారణ స్వరమూ... వగైరాలు గమనించకుండా - 90లలో - ఆంధ్ర నగరాలలో - జవాబివ్వటం సులువు కాదు.

అలాంటపుడు, షాకింగ్ జవాబులు యిచ్చి, తన మగటిమను ప్రదర్శించుకునే అలవాటు రావుకి వుంది.

''ఆడదే'' అన్నాడు లక్ష్మణరావు సిగరెట్ వెలిగించి.

''పేరుని బట్టి, గుడ్డల్ని బట్టి తెలిసే సమాచారం ఎందుకన్నా?''

''కథయిత్రో కవయిత్రో మనకి ఎక్కడా తగలలేదు గురూగారూ! అయినా విమర్శకులు కాంచని చోట సంపాదకులు కాంతురే గదా!''

''సమగ్ర విమర్శకు... రచన ఒక్కటీ సరిపోదని గదన్నా నువ్వంటుంటావు-''

''నిజమే నిజమే అది నా అభిప్రాయమే-'' అంటూ - ప్రచురణకి రచయిత తెలియాల్సిన పని లేదని నువ్వు ఘోషిస్తూంటావు గదా - అన్న భావం బయటపడకుండా జాగ్రత్తపడ్డాడు.

''ఇంతకీ-'' అంటూ ఆగాడు రావు.

''లైంగిక నీతి మీద హైదరాబాద్‌లో మాట్లాడిందన్నా-''

''ఏంది సార్! చలం నరికి పారేసిన లైంగిక నీతి మీద - యింకేముంది మాట్లాడ్డానికి - అంతా చిలక పలుకులే! అదృష్టవంతులు ఆ ఫలాలను అందుకుంటున్నారంతే!''

శేఖరం జవాబివ్వలేదు. లోగడ రావు మాటలను ఎన్నడూ ఖండించలేదు. ఎందుకని? అలాంటి ఫలాలంటూ ఏమైనా వుంటే అవి ఎన్నడూ రాలి, తన ఒడిలో పడలేదు గదా! వాళ్ళూ, వీళ్ళూ ఆ ఫలాలను అందుకున్నామని చెప్పినపుడు మాత్రం, అందుకున్నారని విన్నప్పుడు కూడా - తను మౌనమే వహించాడు. ఎందుకని?

అది నిజమే గదా! ఆ ఫలాలను తన యింటి నుంచే ఈ లక్ష్మణరావే కోసుకుని పోయాడు గదా!

''కరుణలో ఏదో వుంది. విశ్లేషించాలి రావూ!'' అన్నాడు.

''మన పునాది ఇంజనీరింగ్ సార్! డేటా లేకుండా అనాలిసిస్సా?''

''డేటా సంగతి నేను చూసుకుంటాన్లే''

కాని - శేఖరంకి కరుణ గురించి పని కట్టుకుని తెలుసుకునే తీరిక లేకపోయింది.

మూడేళ్ళు ఎంత తక్కువ కాలం! కాని తన జీవితంలో ఎన్ని సంఘటనలు! కొన్ని ఎత్తులు? మరి కొన్ని లోతులు!

ఔద్యోగిక జీవితంలో... ఎడిటర్, మార్కెటింగ్ మేనేజర్ రెండు పోస్టులూ నిర్వహించే అవకాశం లభించింది! బహుశా తెలుగు పత్రికా రంగంలో తనే ప్రథముడేమో! ఆ రెండు ఉద్యోగాలూ పూర్తిగా పరస్పర విరుద్ధమయినవనుకున్నాడు! 'ఒకటి వస్తువు తయారీ... మరొకటి వస్తువు అమ్మకం! తయారీలోని సృజనాత్మకత తృప్తినిస్తుంది గాని... సృజనాత్మకత అవసరం లేని అమ్మకం పని ఏం తృప్తినిస్తుంది!' అనుకునేవాడు. క్రమంగా... ఆ భావం మారుతూ వచ్చింది. పత్రికకు పనికొచ్చే వస్తువుని ఎంచటం, దాన్ని ఆకర్షణీయంగా ప్రదర్శించటం, అందులో కొంత సామాజిక బాధ్యత వుందనుకునేవాడు. వస్తువు, ఎంచటంలో 'సృజనాత్మకత' అవసరమనీ, అదే తనకు తృప్తి కలిగిస్తుందనీ అనుకునేవాడు. ఎంచటంలో ఏ మాత్రం సృజనాత్మకత వుందో, ఆ మాత్రం 'అమ్మకం'లో కూడా వుందని... అందుకు అంతకన్న హెచ్చు సృజనాత్మకతే అవసరమనీ భావించసాగాక... అతనికి హృదయం పెట్టే అల్లరి క్రమంగా తగ్గింది.

ఆ రెండు పోస్టులలోనూ సర్దుకున్నాక తన జీవితంలోకి రాజ్యం జొరబడింది!

రాజ్యం! రాజ్యం!

తన వైఫల్యానికి నిలువుటద్దం!

★★★

శేఖరం ఆలోచనలను వదిలించుకునే ప్రయత్నంలో తన చిరునామాల డిజిటల్ డైరీ వెదికాడు. ఎక్కడా కరుణ లేదు. ఆ డైరీ తన పెళ్ళికి ఎవరో కానుక యిచ్చారు. అందులో బెంగుళూరు చిరునామాలలో శివగంగమూర్తి ఫోన్ నంబరు వుంది.

శివగంగమూర్తి - స్వగ్రామం విజయవాడ దగ్గర ఏదో గ్రామం. అక్కడికి వచ్చినప్పుడల్లా పత్రికల కార్యాలయాలు దర్శిస్తాడు. వచ్చినప్పుడల్లా తన విజిటింగ్ కార్డ్ యిస్తాడు. కవిత్వం రాస్తాను - వినమంటాడు. వ్యాసాలు రాస్తాను - చూడమంటాడు. పుస్తకాలియ్యి - సమీక్షిస్తానంటాడు. కన్నడ, తెలుగు, తమిళ సాహిత్యం సమస్తం తనకు కరతలామలకం అంటాడు. తెలుగు నవలలను కన్నడ పత్రికలకూ టీవీకి పరిచయం చేసానంటాడు.

శేఖరం శివగంగమూర్తి నంబరుకి ఫోన్ చేద్దామా వద్దా అని కాస్సేపు ఆలోచించాడు - ఏం పోయిందిలే! ఓ రాయి వేద్దాం అనుకుని ఫోన్ తీసుకున్నాడు.

''ఓహోహో - మీరా సార్ - వచ్చెయ్యమంటారా సార్ - యిప్పుడే బయల్దేరిపోతాను సార్-'' అన్నాడు మూర్తి.

''కరుణ - మీకు తెలుసా మూర్తి గారూ!''

''ఏ కరుణ సార్?''

''ఓమారు హైదరాబాద్‌లో కనిపించింది. కథలూ, అవీ రాస్తుందనుకుంటాను-''

''లేరండి - అట్టాంటావిడ ఎవ్వరూ లేరండి - మీకు కావాలీ అంటే - సార్ - నేను సీరియల్స్ కూడా రాయగలనండి! మీరు కోరినట్టు రాస్తా సార్ - అఫ్‌కోర్స్ - సెక్స్ రాయాలంటే - కాస్త చికాగ్గా ఉంటుందండి - ఫర్లేదండి - మానేజ్ చేస్తానండి! నవల ఏదైనా మీరు సజెస్ట్ చేస్తారా సార్ - నన్నే చెయ్యమంటే - సాండర్స్ నవల మగాళ్ళ ప్రాస్టిట్యూషన్ మీద తమాషాగా రాసాడు-''

''మూర్తిగారూ!''

''చెప్పండి సార్ - మాట్లాడుకుందామంటే - వచ్చేస్తానండి! తీర్థం - ఏ బ్రాండ్ యిష్టమండి - ఫారిన్ సరుకు - టీచర్స్ విస్కీ - కల్తీ ఉండదండి బెంగుళూర్లో-''

''మూర్తిగారూ!''

''చెప్పండి సార్!''

''నాకు కరుణ ఎడ్రెస్ కావాలి-''

''బెంగుళూరు చాలా పెద్దది సార్-''

''సాహితీ ప్రపంచం చిన్నదే కదా అందులోనూ తెలుగు''

''అవుననుకోండి-''

''కథలు - కాకపోతే కవిత్వం-''

''ఎంత బాగా చెప్పారు సార్ - అందుకే సార్ - అంత పెద్ద పత్రికను సునాయాసంగా మోస్తున్నారు సార్ - కథలు కాకపోతే కవిత్వం - అవి కాకపోతే వ్యాసాలు - నిజమే సార్ - పేరుకి షార్ట్ కట్ సార్-''

''మూర్తిగారూ-''

''ఎంత బాగా చెప్పారు సార్-''

ఫోన్ పెట్టేసాడు శేఖరం. మనుషుల్ని తగిలించుకోడమే గాదు - వదిలించుకోడమూ తెలియాలి. కాని ఎంత కష్టం!

అస్థిమితంగా కదిలాడు శేఖరం.

'నీకు దేని మీద ఆసక్తి?'

'తెలియదు'

'కరుణ మీదనా?'

'తెలియదు-'

'కరుణ ఒక వస్తువుగానా? ఒక స్త్రీగానా?'

'ఏమో!'

'వస్తువుగా దొరికి... స్త్రీలా ప్రవర్తించాలి! స్త్రీగా దొరికి - వస్తువులా ప్రవర్తించాలి-'

'నేనంత నీచుడిని కాదు-'

'ఎంత నీచుడివి?'

వాన. ప్రశ్నల వాన. జవాబులే ప్రశ్నలైన వాన...

కిటికీ తలుపులు మళ్ళీ తెరిచాడు శేఖరం.

బయట నల్లటి ఆకాశం. నగర దీపాలతో యుద్ధానికి వానని తోడు తెచ్చుకున్న ఆకాశం. ఒరిగిపోతున్న సైనికులలాంటి దీపాలు.

ఏం చేస్తుంటుంది వదిన?

అన్నింటినీ పూర్తిచేసిన వదిన. కొండ చిలువలాంటి వదిన. ఒక్క చిటికెలో తన సమస్త జీవితాన్నీ కబళించి విరిచేసిన వదిన.

''-ఎందుకిలా చేసావు వదినా?''

''నువ్వెంత పనికిరాని వాడివని తెలియక-''

ఒకే ప్రశ్న. ఒకే జవాబు.

జీవితమంతటినీ నలిపేసిన జవాబు. నిర్దేశించిన జవాబు.

అయిదు అడుగుల ఎనిమిదంగుళాల పొడవూ, అరవై కేజీల బరువుతో నిర్మితమైన యీ శరీరంలో - ఒక స్వల్ప అవయవం - యీ శరీరాన్ని నిర్దేశించగలదా? ఇందులో వున్న మెదడుని అణిచెయ్యగలదా?

ఇరవై ఏళ్ళ క్రితం - ఒక చిన్ని సంఘటన - కొన్ని నిమిషాల కాలవ్యవధిలో జరిగిన సంఘటన - యిన్ని ఏళ్ళ సుదీర్ఘ కాలంలోని జీవితాన్ని - యిందులో తాత్విక చింతనలని; ఆశ, నిరాశలనీ, అన్నింటినీ ప్రభావితం చేయగలుగుతుందా?

చేసిందన్నది తన కల్పనా? భ్రమా?

చీకటిలో... వెదుకులాట.

అనంత నిశీధిలో... జ్ఞాపకాల దొంతరల దొంతరల కింద... యవ్వనోద్వేగాల చిత్తడిలో... వెదుకులాట!

చీకటి... లోలోపల చీకటి... తవ్వుకోటానికి భయం పుట్టించే చీకటి... తలచుకొంటేనే వణుకు పుట్టించే చీకటి...

అన్వేషణ... సాఫల్యాల అన్వేషణ.

స్వాగతం - వైఫల్యాల నిరంతర స్వాగతం.

దేహ మాలిన్యాన్ని తొలగించటానికి దేహం మీద యుద్ధం.

పనికిరాని దేహాన్ని పనికొచ్చేట్టు చెయ్యాలని సిద్ధాంతాలతో స్నేహం.

సిద్ధాంతాలతో అడవులు.

సిద్ధాంత రాహిత్యాలతో... వెనుదిరిగి నగరాలు.

చదువులు. పదవులు.

కవిత్వాలు, కీర్తి.

బహిరంగం ముసుగులో అంతరంగం

అంతరంగపు ఊబిలో బహిరంగం.

వైఫల్యాలు వెన్నాడుతూంటే - పరుగు.

దొరికిన సాఫల్యాలన్నీ ముసుగేసుకున్న వైఫల్యాలై - జాగిలాల్లా వెన్నాడుతూంటే - పరుగు.

అంతిమంగా ఏమయాడు?

రాజ్యం వడిలో పడ్డాడు.

రాజ్యం ఒడిలో పడ్డాడు.

చుట్టూ ప్రపంచం మీద తను అల్లిన కవితలన్నీ... కొని తెచ్చుకున్న అనుభూతుల ప్రదర్శనగా... తన లోలోపలి ప్రపంచం మీద తను అల్లలేకపోయిన కవితకు - రాజ్యాన్ని - రూపంగా భ్రమించాడు.

తన సమస్త వైఫల్యాలు సాఫల్యాలేనని చూపించే మాయా దర్పణంగా... దయా సముద్రంగా రాజ్యాన్ని భావించాడు.

రాజ్యంతో వివాహం - కాగితాల మీద సంతకాలు - మారిన దండలు - బంధువుల ఆగ్రహాలు - మిత్రుల భుజం తట్టుళ్ళు.

కాగితాలు మాయలేదు. దండలు వాడలేదు. ఆగ్రహాలు చల్లబడలేదు. తట్టుళ్ళు తగ్గనేలేదు.

భావం భ్రమగా ముగిసింది.

రాజ్యం తను అల్లలేకపోయిన కవితల్లో కలిసిపోయింది.

రాజ్యం తన పరుగుకి గమ్యం అవలేదు. తన అన్వేషణకి అంతిమ లక్ష్యం అవలేదు. తన తొందరపాటా - రాజ్యం తొందరపాటా? తన లెక్క తప్పిందా? రాజ్యానిదా?

రాజ్యాన్ని పొందటంలోని సాఫల్యం భ్రమై మెరిసి... ఆమె తన జీవిత వైఫల్యానికి మరో నిలువుటద్దం అయింది.

★★★

శేఖరం మరో సిగరెట్ వెలిగించాడు. ఆర్పేసాడు.

స్నానాల తొట్టిలోకి నీళ్ళు విప్పాడు. నిండుతోంది.

అద్దంలో... శరీరం తెల్లగా వుంది. అన్నయ్య అంత నల్లగా - తను అంత తెల్లగా లేకపోతే?

అద్దం ముందు నుంచి వేగంగా కదిలి మంచం మీద కూర్చున్నాడు. ఏదో గుచ్చుకుంది. తీసి చూస్తే - డైరీ-! డైరీలో శివగంగమూర్తి నంబరు.

ఒక నిశ్చయానికి వచ్చినట్లు ఫోన్ డయల్ చేసాడు.

''మూర్తిగారూ-''

''చెప్పండి సార్ - నేను కొంచెం జాస్తీగా మాట్లాడతాను. నేనే ఫోన్ చేద్దామనుకున్నాను - హోటలు పేరు చెప్పలేదు సార్''

''ఈ వూళ్ళో ఫెమినిస్టులు ఎవరైనా వున్నారా?''

''అదేంటి సార్ - అట్టంటారు - ఈ రోజుల్లో - సార్ - ఫెమినిస్టులు కాని వాళ్ళెవరు సార్! నాలుగు అక్షరం ముక్కలు నేర్చిన ప్రతి ఆడపిల్లా ఫెమినిస్టే సార్! మా అమ్మాయిలు - సార్ - అలా కాదు సార్ - చాలా జాగ్రత్తగా పెంచాను సార్!''

''నేనడిగేది - ఫెమినిస్టు సంస్థల గురించి మీకెవరయినా తెలిస్తే చెప్పండి-''

''నా దగ్గర - చాలా సంస్థల ఎడ్రస్‌లు వున్నాయి... నేను చూస్తున్నా సార్! మాది సత్సాంప్రదాయ - అని ఓ సంస్థ సార్ - తెలుగోళ్ళు వస్తే మాట్లాడిస్తాం సార్ - ఏక్టర్స్ కూడా వస్తుంటారు సార్ - డిమాండ్ లేకపోతే! రైటర్సయితే - పిలిస్తే చాలు వచ్చి మాట్లాడతారు సార్! వినటానికి బెంగుళూర్లో ఎవరూ రారు సార్. చూట్టానికే వస్తారు. ఆ! దొరికింది సార్ - ఈవిడ. ఇందిరా మేడమ్ - ఫెమినిస్టేగానీ చాలా మంచావిడ. మేం నాటకాల పోటీలు పెడితే - బాగా సాయం చేస్తారు సార్! ఇందిర గారి యజమానికి కాలేజీలూ - అవీ వున్నాయి సార్!''

''ఆవిడ ఫోన్ నంబరు చెపుతారా - రాసుకుంటాను-''

''ఎందుకు సార్! నేను వస్తాను. మిమ్మల్ని తీసుకెళ్తాను సార్! 'ప్రకాశం' పత్రికలో ఫెమినిస్టు సంస్థల మీద వ్యాసం రాస్తున్నారని చెపుతాను సార్. తప్పకుండా కోఆపరేట్ చేస్తారు.''

''మూర్తిగారూ - నాక్కావలసింది ఫోన్ నంబర్ - అభ్యంతరం లేకపోతే - చెప్పండి-''

''నాకెందుకుసార్ - అభ్యంతరం? రాసుకోండి-'' అంటూ నంబరు చెప్పి- ''ఆవిడ చాలా పెద్దావిడ సార్ - రమ్మంటే నేను వచ్చి-''

''థాంక్స్ - అవసరమైతే ఫోన్ చేస్తాను-''

టైమ్ చూసాడు. ఏడూ నలభై.

ఏమిటీ పిచ్చి?

పిచ్చి కాదు. స్వప్నం.

స్వప్నమూ పిచ్చే కదా?

ఎలా అవుతుంది? స్వప్నాలు కనగల వాళ్ళు తమ జీవితాలను మార్చుకున్నారు. సమాజ గమనాన్ని ప్రభావితం చేయగలిగారు.

ఏమిటి నీ స్వప్నం?

శేఖరం స్నానాల గదిలో దూరి తొట్టిలో నీటిని సరిపడా వెచ్చబరుచుకున్నాడు. నీటిలో దిగాడు. వెనక్కి జారబడి కళ్ళు మూసుకున్నాడు.

రాజ్యంతో కన్న స్వప్నం ఏమయింది?

అది చితుకుతున్నపుడు ఆమెతో సంభాషించబోయాడు.

''నీ నుంచి నేను ఏమీ ఆశించలేదు - రాజ్యం''

''ఆశించకుండా ఎవరూ ఏ పనీ చేయరు-''

''అయితే - ఏం ఆశించానని నీ ఊహ?''

''కృతజ్ఞత-''

''అది యాచించితే లభించదని నాకు తెలుసు''

''నీకు తెలియనిదేంటంటే - స్వేచ్ఛకు అర్థం! నీకు తెలియనిదేంటంటే - స్వేచ్ఛను భరించటం-''

''ప్లీజ్ రాజ్యం - పూర్ణంలో పురుగులు ఎంచకు-''

''నేను పురుగుల మధ్య పూర్ణాన్ని దర్శించలేను-''

ఇలాగేనా నడిచేది సంభాషణ? కాదు. ఇది కల్పన. తన స్వభావాన్ని బట్టి - ఎదుటి వారిని స్వీకరించి - వాళ్ళనొక పాత్రగా చేసుకుని తయారుచేసిన కల్పన.

రాజ్యాన్ని తనెందుకు తృప్తిపరచలేకపోయాడు? ఆమె తనను ఎందుకు తృప్తిపరచలేకపోయింది? ఒకరి నుంచి ఒకరు ఎంతో ఆనందాన్ని పొందుతామని ఊహించుకుని, ఒకరికి ఒకరు ఎంతో ఆనందం యివ్వాలని వాగ్దానాలు చేసుకుని... అంత తొందరగా ఎలా అసంతృప్తికి లోనయ్యారు? నిర్ణయానికి ఎక్కువ సమయం తీసుకోకపోవటం వల్లా? సంవత్సరాల తరబడి ఆలోచించి తీసుకున్న నిర్ణయాలు మాత్రం తప్పవని గారంటీ ఏముంది?

పోస్ట్‌మార్టం.

జవాబులు లేని ప్రశ్నలు.

లోపం - ప్రధాన బాధ్యత - ఎవరిది?

తన తాత్విక భావజాలాన్ని అనుసరించి - సామాజిక కారణాలు చూడగలడు. వ్యక్తిగత స్వభావాన్ని బట్టి - లోపమంతా తనదేననుకోగలడు.

మెడలో గుదిబండలాంటి గతం.

ఎదుటివారిలో లోపాలను చూడగలిగే మొరటుతనమే - సుఖకరమని - తర్కం చెపుతుంది.

కాని - గుదిబండ - నడవనివ్వదు. సుఖపడనివ్వదు.

ఏమైతేనేం? రాజ్యంతో తనకు కమ్యూనికేషన్ ఏర్పడలేదు. అది ఏర్పడునో లేదో! కొన్నాళ్ళు సాగితే ఒకరికొకరు అలవాటయే వారేమో!

అలా జరగలేదు. రాజ్యమూ, లక్ష్మణరావూ ఒకే మంచం మీద దృశ్యం - తనకెందుకు ఆగ్రహం కలిగించలేదు? కలిగించకపోవటం - ప్రేమ లేకపోవటానికి నిదర్శనమా? తన ఔన్నత్యమా? చాతకానితనమా?

బహుశా - సాంప్రదాయకతకు వారసత్వం ఆగ్రహం. ఆధునికతకి... ఆలోచనేగాని, ఆలోచనల జాడ్యమేగాని... ఆవేశం వుండదు.

''రావూ - నువ్వింత మిత్ర ద్రోహివనుకోలేదు-''

''మీరు పెళ్ళాడినంత మాత్రాన - రాజ్యం ఒక వ్యక్తి కాకుండా పోదు. నేను మీకు చేసిన ద్రోహమేం లేదు. ఆమెకు యిష్టం లేకుండా ఆమె చేయి - భర్తయినా సరే - పట్టుకోడం తప్పు. అంతే!''

''ఆమె - యిష్టమేనా - ప్రధానం?''

''అనే - చలం చెప్పాడు - అనే మీరూ రాసారూ... అనే మనం అనుకున్నాం-''

''చలం అన్నది ఆగ్రహంతో! ఆనాటి సమాజంలో స్త్రీల పరిస్థితి మీద ఆక్రోశంతో ఆయన అంతరంగం వేసిన కేక అది. ఆయన అన్ని కోణాల నుంచీ ఆలోచించి చెప్పిన సిద్ధాంతం కాదు - అది''

''మీరు కవి. ఆవేశంలో మీ నోట వెలువడేది కవిత్వం. నేను విమర్శకుడిని. కవిత్వానికి ఆవేశం రూపమూ, సారమూ అని గ్రహించినవాడిని. దాన్ని కవితా న్యాయంగా సమర్థించగలవాడిని. అంతే కాదు - ప్రపంచాన్ని ప్రభావితం చేసిన కొన్ని సిద్ధాంతాలకు బీజాలు వ్యక్తిగత స్పందనలలో... ఆవేశాలలో... వుంటాయన్న వాస్తవాన్ని చూడగల వాడిని - చూపగలవాడిని''

''నువ్వు విమర్శకుడినని చెప్పుకుంటున్నావు. ఏది ఆవేశమో... ఏది సిద్ధాంతమో నీకు తెలియాలి... అది నీ కనీస బాధ్యత''

''గురూగారూ... కవి ఆవేశం ఎంత బలమైనదో, ఎంత అందంగా వ్యక్తమయిందో చెప్పటానికి ఆలోచనను ఉపయోగించటమే - విమర్శ. కవి ఏ సామాజిక నియమాలను శృంఖలాలుగా భావించి, శపించి, ధ్వంసించమని ప్రపంచానికి మొరపెట్టుకున్నాడో - ఆ నియమాలు శృంఖలాలా కావా అన్న చర్చకు దిగటం విమర్శకుని పరిధిలోకి రాదు. ఆ పని అతడు చేయబోతే కుక్క పనిని గాడిద చేయబోయినట్లవుతుంది. ఇటువంటి విషయాలలో ఒకనాడు సిద్ధాంతాలుగా కనిపించినవి - మరోనాడు కేవలం ఆవేశాలుగా కనిపించే సందర్భం ఎందరికో ఎదురయింది. అది ఒకే ఒక సందర్భం. తన భార్యా, పిల్లలూ, తల్లీ, అప్పచెల్లెళ్ళను వ్యక్తులుగా చూడలేకపోయిన సందర్భం - చూడాల్సి వచ్చిన సందర్భం-''

ఇలాగేనా మాట్లాడుకున్నారు?

ఏం మాట్లాడుకున్నదీ అప్రధానం. గుర్తున్నదే ప్రధానం. అదయినా మారకుండా వుంటుందా? ఉండేలా లేదు.

రచనలో వాక్యాలనూ, పాత్రల సంభాషణలనూ యథాతథంగా గుర్తుంచుకోగల వాళ్ళు అదృష్టవంతులేమో! వాళ్ళను భావాలు బాధించవు, బంధించవు. లక్ష్మణరావుకి అలాంటి జ్ఞాపకశక్తి వుంది. బహుశా వాళ్ళు తమ జీవితంలోని సన్నివేశాలనూ, సంభాషణలనూ అలా గుర్తుంచుకోగలరేమో!

భావాలూ, ఆలోచనలూ గుర్తుంచుకొనేవాళ్ళు కాదు, గుర్తుండేవాళ్ళు - ఎంత దురదృష్టవంతులో తనకు అనుభవైక వేద్యం.

రాజ్యం అతన్నించి పొందినదేమిటి?

తను ఆమెకు యివ్వలేకపోయినది. యివ్వలేదని తను అనుకొన్నది. నిజంగా అదేనా? అదేనా రాజ్యం అతని నుంచి పొందినది? అందుకోసమేనా వైవాహిక భద్రతను కూడా నిర్లక్ష్యం చేసింది? అదేనా - అదేనా?

అది ఆమె శారీరకావసరమా? మానసికావసరమా? అది తన శారీరక లోపమా? మానసిక లోపమా?

ఏమో! తన మీద తనకే అపనమ్మకం. తన ఆలోచనా శక్తి మీద తనకే అపనమ్మకం. జీవితమంతటా పరచుకున్న యీ అపనమ్మకాన్ని తొలగించగలవా కరుణా? నా మీద నాకు నమ్మకాన్ని ప్రసాదించగలవా కరుణా?

శేఖరం స్నానాల తొట్టి నుంచి లేచి, బొచ్చు తువ్వాలు అందుకుంటూనే వెళ్ళి, ఫోన్ తీసాడు.

ఇందిరకు తనను తాను పరిచయం చేసుకున్నాడు.

''శివగంగ మూర్తి ఫోన్ చేసి చెప్పాడు. మీ పత్రికను చూస్తుంటాను'' అంది క్లుప్తంగా ఇందిర.

మూర్తిగాడు ఏం చెప్పాడు? ఎవడు చెప్పమన్నాడు? శేఖరానికి సర్రున కోపం ఎగదన్నింది.

''కరుణ - అని ఒకావిడ - ఫెమినిస్టు కార్యకలాపాలలో చురుకుగా వుంటుంది - మీకు తెలుసా?''

''-ఎందుకూ?'' అంది ఇందిర. ఆమె గొంతులో మార్పు తెలుస్తూనే వుంది.

శేఖరానికి జవాబు స్ఫురించలేదు.

''-ఆవిడ కొన్నాళ్ళ క్రితం కలిసారు.''

''ఎందుకు కలవదూ?! కలిసి మీ చందాలు అడుక్కునే వుంటుంది. ఆవిడ గారికి మేం నచ్చం. మేము విదేశీ ధనంతో మొలిచిన ఫెమినిస్టులమట! ఇంతకీ వీధుల్లో ముష్టిపిల్లల పేరున అడుక్కుందా - వ్యభిచారుల పేరున అడుక్కుందా?''

''- ఆవిడ - ఆవిడ-''

''మిస్టర్ - అడ్డమైనవాళ్ళ అడ్రసులూ చెప్పే బ్యూరో కాదు నేను -'' చటుక్కున ఫోన్ పెట్టేసింది ఇందిర.

శేఖరానికి నెత్తి మీద మొత్తినట్లయింది. తేరుకునేసరికి తన మీద తనకే కోపం వచ్చింది. ఆ తర్వాత మూర్తి మీద కోపం వచ్చింది.

ఏమైనా కరుణ కథ యింక ముగిసినట్లే - అనుకుని సిగరెట్ వెలిగించాడు. రూమ్ సర్వీస్‌కి ఫోన్ చేసి భోజనం చెప్పాడు. బయట వాన సన్నగా పడుతూనే వుంది.

ఒక చిన్న ప్రయత్నం... ఒక పెద్ద వైఫల్యంలా...

శేఖరం ఆలోచనలను మరలించుకోటానికి మరుసటి రోజు సభ మీద దృష్టి పెట్టాడు.

''దక్షిణ భారత భాషలలో పత్రికలు - సాంప్రదాయక విలువల పోషణ'' - అదీ సబ్జెక్టు. దీని మీద జర్నలిజం విద్యార్థులకు వర్క్‌షాపట.

ఏమిటీ సబ్జెక్టు! విలువలు మారిపోతున్నాయని - యింకా స్పష్టంగా ఏడవాలంటే - విలువలు ధ్వంసమై పోతున్నాయని నిర్వాహకుల అభిప్రాయం. వాటిని నిలబెట్టే చాకిరీ యీ పత్రికలు చెయ్యాలని ఆ మహానుభావుల అంతరార్థం. అసలు - ఈ పత్రికా రంగం - ఆ విలువలను నిలబెట్టగలిగేటంత శక్తివంతమైనదని - ఏ గాడిద కొడుకులు వీళ్ళకు ఉపదేశించారు! పైగా దక్షిణ భారత భాషలలో పత్రికలట!! 'చదువుకొనలేని' వాళ్ళు తప్ప 'చదువుకొనగల' వాళ్ళందరూ క్రమంగా మాతృభాషను చదవటమూ, రాయటమూ మానెయ్యబోతున్నారు. ఆ ట్రెండ్ వీళ్ళకి కనబడటం లేదా? కూలి చేసుకునే జర్నలిస్టుగాళ్ళు ఈ సమాజాన్ని రక్షించాలా? తమ పొట్ట పోసుకోటానికే ముప్పు రాబోతూంటే గమనించుకోలేని వాళ్ళు!

చికాకు చికాకుగా శేఖరం తను రాసిన ప్రసంగ పాఠం కాగితాలను విసిరేసాడు.

విలువలుట - విలువలు - కాకి గోల!

సిగరెట్‌తో సిగరెట్ అంటుకొంటోంది.

ఫోన్ మోగసాగింది. నెమ్మదిగా వెళ్ళి ఫోన్ అందుకున్నాడు.

''శివగంగ మూర్తి సార్!''

''ఏం నాయనా - నువ్వు ఇందిర గారితో ఏం వాగావు?''

''మీకులాగే ఆవిడగారు ఫోన్ చేసి వాయించారు సార్!''

''ఎందుకని! ఏం చెప్పావేమిటి ఆవిడకి?''

''తప్పదు సార్! ఆవిడతో అలాగే చెప్పాలి సార్ - ఇంతకీ మీక్కావలసింది ఆర్కేదేవి అడ్రస్సు గదా సార్-''

''ఆవిడెవరు? నాక్కావలసింది కరుణ''

''అదే సార్! కరుణాదేవి. స్కూల్లో టీచర్. తెలుగు పాఠం చెపుతుంది. చిత్రమైన మనిషి సార్ - ఒక్కోమారు-''

''మూర్తిగారూ - ఆవిడ అడ్రస్ వుంటే చెప్పండి - లేకపోతే ఫోన్ పెట్టేయండి-''

''ఉంది సార్ - పులకేశినగర్‌లో మీరా అడ్రస్ పట్టుకోలేరు. నేను వచ్చి తీసుకెళ్తాను సార్–''

''మీకంత శ్రమ అవసరం లేదు. నన్ను కలియాలంటే రేపు రవీంద్ర కళాక్షేత్రలో సమావేశం వుంది. అక్కడికి రండి! చెప్పండి - ఆవిడ అడ్రస్!''

అడ్రస్ రాసుకున్నాడు శేఖరం.

''మీకీ మాత్రం వుపయోగపడినందుకు చాలా సంతోషంగా వుంది సార్! రేపు సమావేశానికి రాకుండా ఎలా అవుతుంది సార్! మీకేం కావల్సినా నాకు ఫోన్ చెయ్యండి సార్! ఆటోలోనయినా వస్తాను సార్-''

ఫోన్ పెట్టేసాడు శేఖరం.

'ఆత్మాభిమానమన్నది చచ్చిపోయిన శవాల దేశం యిది!' - అనుకున్నాడు.

అడ్రస్ కాగితం వయిపు చూసాడు. ముందు కాగితం - తర్వాత అక్షరాలు - కలగాపులగంగా మొదలై స్పష్టం కాసాగాయి.

శేఖరంలో ఒకవిధమైన ఉద్వేగం మొలకెత్తసాగింది.

వెళ్తావా? - తెలియదు.

ఎందుకు? - తెలుసు. తెలియదు.

ఏమవుతుంది? - ఏమయినా అవొచ్చు.

ఏమవవచ్చు? - ఖాతాలో మరో అంకె జమ కావచ్చు.

ఏ ఖాతాలో? సాఫల్యాల ఖాతాయా? వైఫల్యాల ఖాతాయా?

వైఫల్యం సాఫల్యమయిన ఖాతాయా?

సాఫల్యం వైఫల్యమయిన ఖాతాయా?

ప్రశ్నల రాళ్ళ నుంచి తప్పించుకోటానికన్నట్లు బాత్రూంలోకి దూరాడు.

తొట్టిని చూసేసరికి - ఎన్నిసార్లు స్నానం చేసాడో గుర్తొచ్చింది.

బయటకు వచ్చి బట్టలు తగిలించుకుంటూ రిసెప్షన్‌కి ఫోన్ చేసాడు. టాక్సీ ఏర్పాటు చేయమన్నాడు.

అడ్రస్ కాగితాన్ని జేబులో పెట్టుకుని, పది నిమిషాల తర్వాత శేఖరం బయలుదేరాడు.

★★★

డ్రైవరు పేరు మెహబూబ్ ఖాన్. శేఖరం ఆంధ్రా సాబ్ అని తెలియగానే తెలుగులో ఆరంభించాడు. సంసారం గురించి చెప్పాడు. అనంతపురం నుంచి పదిహేనేళ్ళ క్రితం వచ్చాడట. తన టాక్సీల బ్రతుకు గురించి చెపుతున్నాడు. రకరకాల విషయాలు మాట్లాడుతున్నాడు.

అతను విశేషాలను చెప్పటం లేదు. జీవితాన్ని వ్యాఖ్యానిస్తున్నాడు. అతని వ్యాఖ్యానానికి ఇరుసు నీతి. అతని లెక్క ప్రకారం నీతి పలచబడుతోంది. ఇరుసు అరిగిపోతోంది. ఏదో రోజున సర్వం కుప్పకూలి పోతుందని ఖాన్ నమ్ముతున్నాడు.

శేఖరంలో... ప్రశ్నలు తన్నుకుంటున్నాయి.

ఏమిటీ ఏంగ్జయిటీ? నిజంగా ఏదైనా జరుగుతుందా? ఇది తనకు ప్రత్యేకమా? మగాళ్ళందరికీ సామాన్యమా? కాకపోవచ్చు. యావగాళ్ళకి మాత్రం ప్రత్యేకమా? కాదేమో! ఇది తన రోగమేమో!

శేఖరం ప్రశ్నలకు ఖాన్ కబుర్లు నలుపు చుట్టూ తెలుపులా వున్నాయి. చికాకు కలుగుతోంది.

విలువలు కూలిపోతున్నాయని - యింతమంది బాధపడి పోతూంటే - పత్రికా సాహిత్యం అభూత కల్పనలనీ, సెక్సునీ భుజాన్న ఎత్తుకుని ఎలా అమ్ముకోగలుగుతూంది?

ఆ ప్రశ్నే శేఖరానికి గందరగోళంగా అనిపించింది. ఈ సమాజం బాధ్యతంతా పత్రికల మీద - అంటే తన మీద వుందా? ఇది భ్రమ! నాన్సెన్స్! నా యిష్టం! అనుకున్నాడు!

అది మాత్రం సాధ్యమా?

సిగరెట్ ముట్టించాడు శేఖరం.

''సాబ్! ఒకప్పుడు నాకు కారా కిళ్ళీ పడేది కాదు. మందు వాసనొస్తే - కడుపులో తిప్పేది. ఏం చేస్తాం సాబ్!'' అంటున్నాడు ఖాన్.

''-ఏం సిగరెట్ మానెయ్యాలా?'' అడిగాడు శేఖరం.

''లేదు సాబ్ లేదు! పాసెంజర్ల యిష్టాలు డ్రైవర్లు చేసుకోక తప్పదు సాబ్-''

''ఇంకా ఎంత దూరం వుంది?''

''వచ్చేసినాం సాబ్ - ట్రాఫిక్ సాబ్-''

పులకేశి నగర చేరుకున్నాడు.

కారుని మెయిన్ రోడ్డు మీద ఆపి, అడ్రస్ తెలుసుకోటానికి కాగితం పట్టుకువెళ్ళాడు ఖాన్. అక్కడ వాన లేదు. రోడ్డు పక్క గుంటల్లో నీరు మాత్రం చేరుకుంది. పూరీ బళ్ళు, కూరల బళ్ళు, నిస్తేజంగా వున్న వీధి దీపాలు, వైన్ షాప్, మెడికల్ షాప్, చిన్ని చిన్ని గుంపులుగా మనుష్యులు.

పరిసరాలను పరిశీలించడానికి వ్యర్థ ప్రయత్నం చేస్తున్నాడు శేఖరం. ఆలోచనల మీద కత్తులు దూస్తున్న ఆలోచనలు.

శేఖరం తల నొక్కుకున్నాడు.

కరుణను కలుస్తున్నాడా? ఆ తరవాత-?

''రండి సాబ్ - అడ్రస్ చిక్కింది'' అంటూ కారు గేరు మార్చాడు ఖాన్. చిన్న చిన్న సందుల్లో తిరుగుతూ వెళ్ళి ఒక వీధిలో నిలిచింది కారు.

''ఇదే యిల్లు సాబ్-'' కనుక్కొని వచ్చిన ఖాన్ చెప్పాడు శేఖరం కారులోంచి దిగాడు. తలుపు దగ్గర వున్నవాళ్ళు చివరి వాటా - అని చెప్పారు. ఆవరణలో నాలుగు అడుగుల సందుకి అటూ యిటూగా వున్న వాటాల వరస. ఆస్బెస్టాస్ రేకుల పైకప్పు. చివరి వాటాల మధ్య ఒక నుయ్యి. దాన్ని ఆనుకుని స్నానాల గదులు, లెట్రిన్‌లు. ఇంటి ముందు చిన్ని చిన్ని సిమెంట్ నీటి కుండీలు.

''కరుణమ్మ లోపలే వుంది - పోండి'' అంది దోవచూపిన మనిషి. కరుణకి శేఖరం తనెవరో చెప్పగానే గుర్తుపట్టింది. ఇంట్లోకి రమ్మంది. పదీ, ఎనిమిది సైజులో వున్న ముందుగది సందడిగా వుంది. కరుణ శేఖరాన్ని దాని వెనక గదిలో కూర్చోబెట్టింది.

''క్షమించాలి శేఖరంగారూ - ముఖ్యమైన పనిలో వున్నాను. ఈ పుస్తకాలు చూస్తూండండి - వీలయినంత తొందరగా పని పూర్తిచేసుకుని వస్తాను'' అంది కరుణ.

తలూపాడు శేఖరం.

చుట్టూ చూసాడు. ఇంత చిన్న గదులు... వీటిని గదులు అనాలా? రెండు గదులకి మధ్య తలుపులు లేవు. గదిలో నున్న దండెం తాడు మీద బట్టలు, చీరలూ... లోపలి లంగా... బ్రాసరీలూ...

శేఖరం మనసంతా అస్తవ్యస్తమయింది. బ్రాసరీ నంబరెంత అన్న ఊహ రాగానే అతనికి కొంతసేపు అసహ్యం కలిగింది.

ఇంతవరకూ వచ్చాక... ఇంకేముంది? అనుకున్నాడు.

కరుణ ఎలా వుంది?... ఏ రోడ్డు మీదయినా తారసపడితే గుర్తుపట్టగలిగేవాడా? లేదేమో! చూస్తే... మరోసారి చూడాలనిపించేదా? ఆమె గుర్తున్నదానిని మించే ఆకర్షణీయంగా వుంది.

ఎక్కడుందా ఆకర్షణ?

ఆమె శరీరాంగాలలో... ఎక్కడుందనా - ప్రశ్న! స్త్రీ శరీరాంగాలు పురుషుడిని ఆకర్షిస్తాయి గదా... మరి స్త్రీకి పురుషుని శరీరంలో ఆకర్షించేదేమిటి? ఏమీ లేదేమో! అయితే - స్త్రీలు పురుషుల కన్నా నిగ్రహం చూపటానికి కారణం పురుషుల దేహ నిర్మాణమా?

స్త్రీలకి సైతం నిగ్రహం వుండకపోవచ్చని - రాజ్యమూ, వదినా - నిరూపించారు. అంతేకాదు - ప్రపంచమంతటా - స్త్రీ బుద్ధి మీద ఎన్ని నీతులు! స్త్రీ బుద్ధి ప్రళయాంతకమని ఎంతమంది చెప్పారు! అందులో - ఎంత పురుషాధిపత్య ప్రభావం ఉండనీ - స్త్రీలు కూడా ఆకర్షితులవటమనే వాస్తవం వుంది. పురుషుల దేహ నిర్మాణంలో ఆకర్షణా కేంద్రాలు లేకపోయినట్లయితే - స్త్రీ ఆకర్షితురాలవటానికి బీజం ఎక్కడుంది?

ఆమె మెదడులోనే వుండి వుండాలి. స్త్రీల వాంఛకు బీజాలు ఎదుటి వారి దేహ నిర్మాణంలో కొంత వున్నా, హెచ్చుగా వుండేది వారి సొంత మెదడులోనే గదా -

అంటే - పురుషుడిని ఆకర్షించే పని స్త్రీ శరీరం చేస్తే, పురుషుడి పట్ల ఆకర్షితమవటమనే పని స్త్రీ మెదడు చేస్తుందా? ఇందులో ఏదో అసమంజసం లేదూ!!

ఏమో! కరుణ... కరుణిస్తే చాలు!

కరుణించటమంటే-?

ఆమె మెదడులో శేఖరంగాడి పట్ల వాంఛ లేకపోయినా, ఆమె శరీరం దానిని ప్రదర్శించాలనా?

ఛ! ఎంత నీచత్వం నాది!

శేఖరం తల నొక్కుకున్నాడు. అప్రయత్నంగా సిగరెట్ తీయబోయాడు. అతనికి ఆనాటి

కరుణ మాట గుర్తొచ్చింది. పెట్టెను మూసేశాడు.

పుస్తకాలు చూడసాగాడు.

అందులో తన కవితా సంకలనాలు కూడా వున్నాయి. తనతో తిరుగుతూ తిరుగుతూనే... ఎన్‌కౌంటర్లలో... రాలిపోయిన వారి గురించి రాసిన పొడవాటి పద్యం. నమ్మిన ఆదర్శాలు వదిలి... సజీవులుగా వున్న వారి గురించి... ప్రశ్నలు.

ఉద్యమమంటే... కరుణలాంటి వాళ్ళకి వుండేది - రొమాంటిక్ ఆకర్షణ. పదునైన పదాలతో... భావనా పటిమతో... తనబోటి పలాయితులు కవితలల్లి... చేసేది ఏమిటి? కరుణలాంటి వాళ్ళ ఆకర్షణను సొమ్ము చేసుకోవటం!

పక్కగదిలో ఎవరో సన్నగా ఏడుపు. లేతగా వున్న ఒక అమ్మాయి చవకబారు పంజాబీ దుస్తులలో... ఏడుస్తోంది. ఆమె భుజం చుట్టూ చెయ్యి వేసి, పొదివి పట్టుకుని వుంది కరుణ.

''-సిద్ధరాజు పద్మజను పెళ్ళాడాలి. మనం ఉద్యమం నడపాలి-'' అంది ఒకామె. చాలామంది ఏంటేంటో మాట్లాడుతున్నారు. ఆమె సూటిగా కరుణనే అడిగింది. ''అందర్లాగే ఆ మునిస్వామప్పకి నువ్వూ భయపడుతున్నావా కరుణక్కా-?''

కరుణ జవాబు యివ్వలేదు. పద్మజ చుబుకాన్ని ఎత్తి, ''నిజం చెప్పు - ఏమన్నాడు సిద్ధరాజు?'' అని ప్రశ్నించింది కరుణ.

''సంబంధం లేదన్నాడు-''

''దేంతో? ప్రేమతోనా - కడుపుతోనా?''

''ఛ- అలా అంటావేంటి కరుణక్కా!'' పద్మజను ఊరుకోబెడుతూ అంది.

''ఇలాంటపుడు - వాళ్ళు అనే మాటలూ - మనం వినే మాటలు - యివ్వే కదా! ఫరవాలేదు చెప్పు - పద్మజా?''

పద్మజ నెమ్మదిగా విషయం బయటపెట్టింది.

''అలా అనుమానించే వెధవను పెళ్ళాడతావా?'' అంది.

''మరేం చెయ్యాలి?'' ఎవరో ప్రశ్నించారు కన్నడంలో. అందరూ తలో మాటా మాట్లాడుతున్నారు. ఇంతట్లో ఓ కుర్రాడు పరుగెత్తుకుంటూ వచ్చి ఏదో చెప్పాడు. పద్మజ బిగ్గరగా ఏడుస్తూ పరుగెత్తింది. కరుణతో సహా అందరూ ఆమెను అనుసరించారు.

ఒక్కసారిగా యిల్లు ఖాళీ అయిపోయింది. శేఖరానికి ఏం చెయ్యాలో అర్థం కాలేదు. కొంతసేపు అటూ యిటూ తిరిగాడు. తర్వాత టీవీ ఆన్ చేసాడు. వార్తలు. వాజ్‌పేయి ప్రభుత్వం మీద పార్లమెంటు చర్చ. అవినీతి ప్రమాదకరమా? మతోన్మాదమా?

కరుణ వచ్చింది. చటుక్కున సిగరెట్ ఆర్పేసాడు.

''క్షమించాలి శేఖరంగారూ - ఒకావిడ ఎలుకల మందు మింగింది. ఆస్పత్రికి తీసుకెళ్ళాలి. టాక్సీ కోసం పంపాను'' బీరువా తెరిచి డబ్బులు తీసి హేండ్‌బాగ్‌లో వేసుకుంటూ అంది.

''నా టాక్సీ వుంది'' అన్నాడు శేఖరం.

''ఓ! బయటనున్నది మీదా? మరి... మీకు... యిబ్బందవుతుందేమో!''

''ఏం ఫరవాలేదు! పదండి''

★★★

బౌరింగ్ ఆస్పత్రి బయట నించుని వున్నాడు శేఖరం. డ్రైవర్ ఖాన్ లోపలికి బయటికీ తిరుగుతున్నాడు. సమాచారం శేఖర్‌కి అందిస్తున్నాడు - పద్మజ తల్లి ఆత్మహత్య చేసుకోబోయింది. డాక్టర్లు ఆమెను రక్షించారు.

''ఏంది సాబ్ - దేవుడిచ్చిన బతుకుని యిట్టా తీసుకుంటారూ?!''

అతని ప్రశ్నకీ, ఆశ్చర్యానికీ సమాధానం శేఖరం వద్ద లేదు.

''ఎందుకంటావ్?''

''కష్టాలు సాబ్! మనుషులు కట్టాలొస్తే ఎట్టా బతుకుతారూ?''

''-నీకు కష్టాలు లేవా?!''

''ఏంది సాబ్ - అట్టంటారు - అన్నీ కట్టాలే!''

''మరి నువ్వెందుకు బతుకుతున్నావు-''

ఖాన్ ఏదో అనబోతే శేఖరం విసుక్కున్నాడు.

పన్నెండు గంటల ప్రాంతంలో కరుణ వచ్చింది.

''అయ్యయ్యో - మీరు వెళ్ళిపోవలసింది -'' నొచ్చుకుంటూ అంది.

''ఆవిడ ఎలా వుంది?''

''బ్రతికి బయటపడింది. ఆమె భర్తా, బంధువులూ వచ్చారు. ప్రస్తుతానికింక చేసేదేమి లేదు-''

''కారు ఎక్కండి - మీ యింటి దగ్గర వదిలేస్తాను-''

''అంత దూరం వస్తారా-?'' అంటూ కారు ఎక్కింది. కదిలింది.

కొంతసేపటి వరకూ ఎవరూ మాట్లాడలేదు. కళ్ళు మూసుకుని విశ్రాంతి తీసుకుంటూ, చటుక్కున కళ్ళు విప్పి అతని వేపు చూసింది. శేఖరం బయటకి చూస్తున్నాడు.

''గుర్తుపెట్టుకుని వచ్చారు. మాట్లాట్టానికే కుదరలేదు'' అంది.

శేఖరం ఆమె వయిపు తిరిగి, సిగరెట్ తీయబోయి మానేసాడు.

''యింకా గుర్తుందా? పోన్లెండి, కాల్చుకోండి-'' అంది.

శేఖరం సిగరెట్ ముట్టించలేదు. సన్నగా నవ్వాడు. ఆ నవ్వు కరుణకు అర్థం కాలేదు. అతన్ని పరిశీలించింది.

''మీరు ఏదో మాట్లాట్టానికి వచ్చారు... అవునా?'' అంది.

''టైమెక్కడుంది?'' అన్నాడు.

''రేపు వుండటం లేదా?''

''రేపు సాయంత్రానికి రిజర్వేషన్ అయిపోయింది. పొద్దుట్నుంచీ ఎంగేజ్‌మెంట్స్-''

కరుణ ఒక్క సెకను ఆలోచించింది-

''-మీకు అభ్యంతరం లేకపోతే మా యింట్లో వుండొచ్చు-''

''నాకా?''

''మా చిన్నింట్లో మీకు సరిపడా సౌకర్యాలు వుండవు. అంతేగాని...''

''పోనీ-'' సంశయంతో ఆగాడు.

''చెప్పండి-''

''మా హోటలుకి రండి-''

'ఏరా శేఖరం. దీన్నేమంటారు? ముగ్గు. మనం సంస్కారం అనుకునేదాన్ని కాస్త జాగ్రత్తగా కత్తిరించుకుని, ఎదుటివారి సంస్కారాన్ని కొంచెం గిల్లి, చివరకి సాధించదలుచుకున్నదేమిటిరా? ముగ్గులోకి లాగటమా?'

కరుణ అతని కళ్ళలోకి సూటిగా చూసింది.

శేఖరానికి చూపు కలపబుద్ధి వెయ్యలేదు. బయటకి చూసాడు. ఆమె చూపుల్లో ఏముంది? గుర్తు చేసుకోబోతే, స్పష్టంగా కనిపించింది - ఆశ్చర్యం!

ఆశ్చర్యానికి కారణం - బహుశా కుతూహలం.

కుతూహలం - మానవాభ్యుదయ కారకాలైన లక్షణాలలో ప్రధానమైనది. కాని, ఈ సహజ స్వభావం స్త్రీలలో క్రమబద్ధంగా ధ్వంసం చేయబడిందా?

''ఎందుకంత ఆశ్చర్యం-?'' అన్నాడు.

''నాకా?'' అంది కరుణ.

''అంటే-?'' అయోమయంగా అన్నాడు.

''నిజంగానే - మీరు చాలా ఆశ్చర్యపోతున్నారు-''

వారి మధ్య సంభాషణ కొంతసేపు 'ఆశ్చర్యం' మీద సాగింది.

ఆమె భయపడకపోవటం - లేదా భయం కనబడనీకపోవటం - అతన్ని ఆశ్చర్యపరిచింది. ఎన్నడో ఒకసారి చూసిన మనిషి పనిగట్టుకుని వచ్చి - ఏదో మాట్లాడాలనుకోవటంలో - లేదా అలా అనటంలో - అసంబద్ధత ఆమెని ఆశ్చర్యపరిచింది. ఆ విషయాన్ని వాళ్ళిద్దరూ బయటపెట్టకుండా సంభాషణ 'ఆశ్చర్యం' మీద సాగించారు.

''డ్రైవర్! పులకేశినగర పోనియ్ - అమ్మ గారిని దించేసి వెళ్దాం-'' అన్నాడు.

''సడన్‌గా మనసు మార్చుకున్నారేంటి?''

''మనసేం మార్చుకోలేదు. వస్తాననలేదు గదా! రారనుకున్నాను-''

''వస్తాను - ఏ రాత్రయినా ఈ కారు వుంటుంది గదా?''

''తప్పకుండా వుంటుంది. ఏం ఖాన్!''

''అవును సాబ్ - వుంటాను - కారు హోటలుకు పోనిమ్మంటారా?''

శేఖరానికి కరుణలో ఏదో అసాధారణమైన సౌందర్యం కనిపించసాగింది. 'ఆమె ఆత్మవిశ్వాసమేనా ఆ సౌందర్యం-?' అని ప్రశ్నించుకున్నాడు. శరీరానికి లేని అందాలను స్వభావం కల్పిస్తుందా? కాదు. ఇదంత తన తుచ్ఛతకు పులుముతున్న పవిత్రతా వర్ణం.

శేఖరం పిడికిళ్ళు బిగించి కళ్ళు మూసుకున్నాడు.

హోటల్ రూమ్ చేరేసరికి ఒంటి గంటవుతోంది. తలుపులు మూసాక, శేఖరం దగ్గరగా వున్న మంచాలు దూరంగా జరపసాగాడు.

'ఎందుకురా జరుపుతున్నావు?'

'.....'

'ఆమె ఏమనుకుంటుంది?'

'ఏమో- తెలియదు-'

'ఆమె ఏమనుకోవాలని నువ్వనుకుంటున్నావు?'

'.....'

'బుద్ధిమంతుడని - బుర్రలో బురద హీనుడనీ'

ఇంతలా గుచ్చి గుచ్చి ప్రశ్నించే ప్రశ్నలతో హింసించే మనసు రావుకి లేదా? కొందరికి వుండదా? వాంఛ వుండటం, మనసు లేకపోవటమా కలిస్తేనే లైంగిక సంబంధాలు ఏర్పడతాయా?

మంచాలు దూరం చేసి, పక్కలు సరిచేసి, మనసుని నమిలేస్తూన్న ఆలోచనల నుంచి మరలటానికి కరుణ వైపు తిరిగాడు.

కరుణ ఓ కుర్చీలో కూర్చుని వుంది. అతనినే గమనిస్తూన్నట్లుంది. అతను తన వేపు తిరగగానే ఆమె నవ్వింది. కరుణ నవ్వు అతనికి సహజంగా వున్నట్లనిపించింది. అంతలోనే ఆ నవ్వు ఏదో ఆహ్వానంలా అనిపించింది. అలా అనిపించటం అతనికి యిష్టమూ, అసహ్యమూ ఒకే క్షణంలో కలిగించాయి.

''ఏమిటి శేఖరంగారూ - మాటా మంతీ లేకుండా మీలో మీరే ఆలోచించు కుంటున్నారు?'' అంది కరుణ.

''మీరూ - మాట్లాడలేదు. మీరేం ఆలోచిస్తున్నారు?''

''ఈ గది యింత విశాలంగా, యిందులో వస్తువులు యింత సౌకర్యంగా వుండటం కోసం - ఎన్ని గదులు బుల్లి బుల్లిగా, కనీసావసరాలకైనా చాలని వస్తువులతో వున్నాయో అంచనా వేస్తున్నాను-''

''ఎప్పుడూ ఆ లెక్కలేనా?''

''మీలా కవిని కాదుగా - అంతకన్న బాగా ఊహించటానికి''

''మీరు నా కవిత్వం చదివారా?''

''మీ మూడు సంకలనాలు నా దగ్గర వున్నాయి-''

''చదవలేదంటారు-''

''చదవని పుస్తకాలు నా దగ్గర వుంచుకోను-''

''చదివేసాక - యింకెందుకు పుస్తకాలు-''

''కొన్ని - మరోసారి చదువుకోవాలనిపిస్తాయి-''

''అయితే - నా కవిత్వం కూడా ఫరవాలేదనుకోమంటారు-''

''మీ కవిత్వం మీద నా అభిప్రాయం కావాలని సూటిగా అడగొచ్చు''

''అర్థమయాక - మీరూ చెప్పొచ్చు''

ఇద్దరూ నవ్వుకున్నారు.

కొంచెం సమయం తీసుకుని - కరుణ అంది:

''కవిత్వమంటేనే వేదన. ఆధునిక కవిత్వమంటే కేవలం వేదన. ఆధునిక మానవుడు వేదనకే ప్రతిస్పందిస్తాడు. కవి అయితే వేదననే పలుకుతాడు. పాఠకుడయితే వేదనకే కదులుతాడు. ప్రతిభతో బాటు, కవి తీవ్రాతి తీవ్రంగా వేదన చెందటమే, కవిత్వానికి హృదయం. వ్యక్తిగతాంశాల నుంచి తీవ్రాతి తీవ్రంగా వేదన చెందటానికున్న అవకాశం - సామాజికాంశాల మీద కవి స్పందనలో - లేదు. అందుకే మీ తొలి కవిత్వంలో నున్న వేదన - తర్వాత తర్వాత - కనిపించదు-''

''అంటే-?''

''అర్థం కాలేదా? నాచేత చెప్పించాలనా?''

శేఖరానికి ఉడుకుమోత్తనంగా వుంది. సంభాషణ ఆమే నడుపుతోంది. దాని కళ్ళాలు తన వద్ద లేవు. అదో కారణమైతే - సాధారణీకరించటాన్ని అలవాటుపడ్డ అతని బుద్ధి - వ్యక్తులు ఒకరితో ఒకరు మాట్లాడుకోటానికి ప్రోత్సహించని సామాజిక జీవితం - గురించి ఆలోచిస్తుంది. అది రెండో కారణమైతే - ఆమె తనతో ఏమన్నదీ అర్థం కాలేదు.

గుర్తు చేసుకోటానికి ప్రయత్నిస్తూ అన్నాడు -

''-వేదనే కవిత్వానికి పునాది. ఒప్పుకోవలసిందే! కాని ఏ కవీ తన అన్నిరకాల వేదనలనూ పలకడు. తెలిసి ఎంచుకున్నా, తెలియకుండానే ఎంచుకున్నా - కవిత్వంగా బయటపడే వేదనలు - కవి ఎంపిక చేసిన వేదనలు మాత్రమే! ఆ ఎంపికలో అతని స్వానుభవాలు, సమకాలీన సామాజిక భావజాలం, అతని కాంప్లెక్సు -వగైరా ఎన్నింటి ప్రభావమో వుంటుంది. ఒక్కో సందర్భంలో... జీవిత కాలమంతా వెన్నాడిన తీవ్రాతి తీవ్రమైన వేదనను - కవి తన కవిత్వంలో స్పృశించలేక పోవచ్చు. అతను ఎంచుకున్న వేదనలతోనే ఎందరి హృదయాలనో కదిలించవచ్చు-''

ఆమె కళ్ళార్పకుండా అతన్నే చూస్తోంది.

కరుణ ఆలోచనలను ఒకచోటికి చేరుస్తున్నట్లు అడుగు పెదవిని మునిపంటితో నొక్కుకుంది. తల చిన్నగా ఆడిస్తూ అంది-

''-నా అభిప్రాయం పూర్తిగా తప్పంటారు-''

''మీరన్నది శ్రద్ధగా వినలేదు - కరుణగారూ! ఒక్క విషయం చెప్పగలను. కవిత్వం రాసేటపుడు - కవిలో చెలరేగేదానికి, దాన్ని చదివేటపుడు పాఠకుడిలో చెలరేగేదానికీ - సంబంధం వుండకపోవచ్చు. అలాగే కవి జీవితమంతటా పడే వేదన అతని కవిత్వానికి వస్తువు కాలేకపోవచ్చు-''

''మీరు కవిత్వంలో వ్యక్తం చేయలేని వేదన ఏదైనా మీ జీవితంలో వుందా?''

''ఉంది!'' అన్నాడు వెంటనే.

''ఏమిటది?''

అతను కొంతసేపు ఏమీ మాట్లాడలేదు. గదిలోనున్న గోడ మీద ఏదో బల్లి కదులుతోంది. దాన్నే చూస్తున్నాడు.

'ఎందుకింత ఉద్వేగం నాలో? ఇది శరీర వాంఛా? కేవలం శారీరక వాంఛేనా? కాక ఏమిటి? నా జీవితంలో దుఃఖం లేదా?'

'ఉంది. అయితే ఆ దుఃఖంతో నువ్వు ఎంతకాలం వున్నావు? ఏ సందర్భాలలో దాన్ని బయటపెట్టావు? ఏం ఆశించి బయటపెట్టావు? ఈ సందర్భంలో నీది నిజంగా దుఃఖమేనా? ఇది నటనకు రంగం తయారు చేయటం కాదా?'

'ఎందుకు నటన?'

'సానుభూతి కోసం - ముగ్గులోకి లాగటం కోసం-'

'కాదు. కాదు. కాదు. నా దుఃఖం నటన కానే కాదు.'

'మరయితే ఏమిటీ ఉద్విగ్నత. అది నిజంగా దుఃఖోద్విగ్నతా? శారీరకోద్విగ్నతా? జీవితమంతటా మోస్తూన్న దుఃఖోద్విగ్నతకీ - ఈ క్షణంలో - పరిచయముండీ లేని స్త్రీతో, జరుగుతుందో లేదో తెలీని అనుభవపు స్పృహతో కలగటానికి అవకాశమున్న శృంగారోద్విగ్నతకీ తేడా లేదా? అది గుర్తుపట్టరానిదా శేఖరా! ఖరా!!

తల విదిలించుకున్నాడు శేఖరం -

''ఏమయింది?'' అంది కరుణ.

''సత్యం చెప్పాలనుంది -''

''చెప్పండి-''

''అదేమిటో తెలీటం లేదు-''

''తెలియదా? చెప్పటానికి భయపడుతున్నారా?'' - ఆమె గొంతు మారినట్లనిపించింది శేఖరానికి.

ఆమెను పరిశీలనగా చూసాడు.

'ఇంతవరకూ ఆమె గురించి ఒక ప్రాణమున్న వ్యక్తిగా నేను ఆలోచించలేదు' అనుకున్నాడు. ఆమె ప్రశ్నతో - ఆ గొంతుతో - ఆమె వాక్యంలోని 'భయం' అనే పదంతో అతని దృష్టి మారింది.

పరిశీలిస్తూంటే - ఆమె ప్రయత్న పూర్వకంగా దేనినో దాచుకుంటున్నట్లూ, అప్రయత్నంగా దేనినో వ్యక్తం చేస్తున్నట్లూ- అనిపించసాగింది.

శేఖరం కొద్దిగా రిలాక్సవుతూ అడిగాడు.

''మీకేమనిపిస్తోంది? భయపడుతున్నాననా?''

''నాకా? నాకూ - నాకూ - చెప్పలేకపోతున్నట్లే కన్పిస్తోంది''

''ఏంటా చెప్పలేకపోతున్నదీ-'' కొద్దిగా నవ్వు కలిపాడు.

''నాకెలా తెలుస్తుందీ-'' గొంతులో మార్పు.

''ఊహించండీ-'' ఆ మార్పుని గుర్తించకుండానే అదే నవ్వు మిళాయిస్తూ అన్నాడు.

కరుణ చురుకుగా చూసింది.

''ఈ అర్ధరాత్రి వేళ - అంత శ్రమపడే తీరిక నాకు లేదు''

శేఖరం ఆమెను నిశితంగా చూసి -

''కారు సిద్ధం చేయమంటారా?''

చిన్న తొట్రుపాటుతో- ''ఏం? ఎందుకూ?'' అంది.

''ఇలాంటి అర్ధరాత్రివేళ ఏ అపరిచిత వ్యక్తితోనయినా - ఏకాంతంలో - ఏ స్త్రీ అయినా ఒక్కలాగే ఆలోచిస్తుంది. అది స్త్రీ నర నరంలోనూ యింకిపోయిన ఆలోచన'' అన్నాడు.

కరుణ అతన్ని పట్టి పట్టి చూసింది.

''మిమ్మల్ని బాధించటం నా లక్ష్యం కాదు. నా బాధను మీతో పంచుకోవటమే నా లక్ష్యం-''

''నన్నే ఎందుకు ఎంచుకున్నారు-?''

''మీరు ఫెమినిస్టులు కనక -''

''ఆంధ్ర దేశంలో ఫెమినిస్టులకేం కొదవా-?''

''నా నిర్వచనానికి సరిపడిన వాళ్ళెవరూ - నాకు తారసపడలేదు''

''ఏమిటో - మీ నిర్వచనం?''

''స్పృహ-''

''స్పృహా! ఏం స్పృహ?''

''నా దృష్టిలో ఫెమినిస్టులు వైయుక్తికంగా సాధించవలసినది - ఆడదాన్ననే స్పృహ నుంచి బయటపడి, స్వాతంత్ర్యం పొంది, వ్యక్తిగా పరిణమించటం. వాళ్ళు సాంఘికంగా సాధించవలసినదేంటంటే - ఆ స్పృహ నుంచి తమని ఏ బయట శక్తీ బయటకు లాగలేదని స్త్రీలు అందరూ గ్రహించేట్టు చేయటం-''

పెదాలు దగ్గరగా మూసి, కొద్దిగా ఉబ్బించి, కళ్ళు విశాలంగా చేసి అతన్ని శ్రద్ధగా వింటోంది.

తను చెపుతున్నది పూర్తవుతూండగానే అతని దృష్టి ఆమె భంగిమలో లగ్నమయింది. ఒక్క లిప్తపాటు - అతని యావత్ శరీరమూ, హృదయమూ, బుద్ధీ కలగలిసిపోయి - ఆ భంగిమలోని ఆ కళ్ళను చుంబించాలన్న - భావనగా మారిపోయాయి.

''ఆ స్వాతంత్ర్యం మేం సాధించలేకపోయామా?''

''అందరూ నాకెలా తెలుస్తారు? నాకు తెలిసినంతవరకూ మీతో సహా - ఏ ఫెమినిస్టు స్త్రీ ఆ స్వాతంత్ర్యం సాధించలేదు-''

''నా గురించి - అంత ఖచ్చితంగా ఎలా చెప్పేస్తున్నారు-?''

''-నేను తడుముకున్నాను యిందాకా! అప్పుడు మీరు తీసుకున్న అర్థం - ఏ

మామూలు స్త్రీ అయినా తీసుకునే అర్థమే! నిజమైన ఫెమినిస్టు - మరేం అనుకోకండి - ఆ స్వాతంత్ర్యం సంపాదించిన స్త్రీ - మరెన్నో రకాలుగా చూడగలుగుతుంది''

''మీ మాటలు చిత్రంగా వున్నాయి''

'అమ్మ దొంగ వెధవా! ఏం బాగా లాగుతున్నావురా - ముగ్గులోకి!'

'లేదు - లేదు - నేను పాయింట్ చెపుతున్నాను. నా బాధను పంచుకోవాలనుకుంటున్నాను.'

శేఖరం సిగరెట్ తియ్యబోయాడు.

ఆమె ''కాల్చుకోండి'' అంది.

అతను కాల్చలేదు.

''కరుణగారూ - నిజంగా నేను చిత్రంగానే మాట్లాడుతున్నాను-'' అంటూ తిరిగి ఆరంభించబోయాడు.

కరుణ అడ్డు తగిలింది- ''మీరంటూన్న వ్యక్తిగా మారటం... వింటానికి బానే వుంది''

''సాధ్యం కాదంటారు-''

''ముందుగా- నేననేది- శ్రద్ధగా వినమంటాను-'' చురుగ్గా అంది కరుణ.

''తప్పకుండా వింటాను. చెప్పండి''

''ఫెమినిస్టు స్త్రీ వైయుక్తిక లక్ష్యం, సామాజిక లక్ష్యంగా మీరు చెప్పేది - ఆలోచించవలసినవే! చర్చనీయాలే! అంతవరకూ ఒప్పుకుంటాను. దాని మీద ఆధారపడిన మీ అంచనాలు మాత్రం అంగీకరించను. అంగీకరించను గనక - వాదించదలచుకున్నానని మీరు అనుకోవద్దు! ఈ ఏకాంతం నన్ను భయపరుస్తోందని మీ అంచనా. ఆ భయం - అదే స్పృహ - లేకపోతే మరోలా ఆలోచించేదాన్నని మీ సారాంశం. అయ్యా - శేఖరంగారూ! ఓ మనిషి, ఓ మనిషిని అర్థం చేసుకోటానికి ఒక్కొక్కపుడు జీవిత కాలం సరిపోదు. ఆ విషయం తెలియనంత తెలివితక్కువ వాళ్ళు కాదు మీరు! నేనేదో మీ గురించి - మీరేమో నా గురించి - ఏందేందో ఆలోచించేస్తున్నామన్న గందరగోళం వదిలెయ్యండి! మీరు నాతో మాట్లాడదలచుకున్నదేదో - చాలా స్పష్టంగా వుంది. సూటిగా దాన్ని చెప్పండి! మీకు కొంత టైము కావాలి. నేను బాగా అలసిపోయాను. కాస్త ఫ్రెష్ అయి వస్తాను - మీరు ఆలోచించుకోండి'' అంది.

కరుణ బాత్రూంలోకి వెళ్ళింది.

శేఖరం వెంటనే సిగరెట్ వెలిగించాడు. కిటికీ తెరలు తీసి, తలుపులు తెరిచాడు. చల్లటి గాలి. వాన లేదు. వానగాలి కూడా లేదు. సిగరెట్ పొగ పీలుస్తుంటే, ఏదో టెన్షన్ విడిపోతున్నట్లుంది. గబగబా సిగరెట్ పూర్తిచేసి, దాన్ని ఆష్ ట్రేలో వేసాడు. తలుపులు మూసి, తెరలు వేసాడు.

సోఫాలో కూర్చున్నాడు. లేచి కుర్చీలో కూర్చున్నాడు. మంచం మీద వాలాడు. లుంగీలోకి మారాలనిపించింది. మారలేదు.

మంచం మీద నుంచి లేస్తూంటే -

కరుణ బాత్రూంలోంచి వచ్చింది. మొహం కడుక్కున్నట్లుంది. ఒకటి రెండు నీటి బొట్లు జుత్తు మీద మెరుస్తున్నాయి. పైపైన దువ్వుకుని, పౌడరు రాసుకుంది. బొట్టు - ఎక్కడ దాస్తారు - ఈ ఆడవాళ్ళు.

వస్తూనే మంచం మీద కూర్చుంది. తలగడా దాపుతో గోడకి జారబడి కూర్చుంది. శేఖరం వయిపు చూసి నవ్వింది -

''నా నిద్ర మత్తంతా పోయింది. యిప్పుడు చెప్పండి. ఏంటి మీ ఉద్దేశ్యం?''

''నా ఉద్దేశ్యమా - నా ఉద్దేశ్యం-''

''చూడండి - మీరు చెప్పలేకపోతే అది మీ సమస్య. వెళ్ళిపొమంటే వెళ్ళిపోతాను - పడుకొని పొద్దుటే వెళ్లమంటే పది నిమిషాలలో నిద్రపోతాను-''

''మీరూ...''

''నా మీద మీ వ్యాఖ్యానాలు వద్దే వద్దు-'' అంది.

శేఖరం కళ్ళు మూసుకొని - కొద్దిగా కంపిస్తున్న గొంతుతో - అన్నాడు.

''నాకు మీరు కావాలి''

''ఎంతసేపు?'' వెంటనే ప్రశ్నించింది.

అతను ఆమె నించి ఊహించినవాటిల్లో - ఎంతసేపు - అన్న ప్రశ్న లేదు. దాంతో షాక్ తగిలినట్లయింది.

''మీరేంటంటున్నారూ-?'' అన్నాడు అయోమయంగా.

''నేను - మీకు - ఎంతసేపు కావాలీ అని అడుగుతున్నాను-''

''నేనన్నది-''

''స్వామీ- మీరు అన్నదీ, నేను విన్నదీ, దానికి జవాబు యిస్తూ ప్రశ్నిస్తూన్నదీ - అంతా స్పష్టమే! చెప్పండి - నేను మీకు జీవితాంతం కావాలా? ఈ రాత్రి గడిచే వరకూ కావాలా?''

తలెత్తి ఆమెను పరిశీలించాడు.

ఆమె ఆడదేనా? వదినలా... రాజ్యంలా... ఆడది కాదా? వాళ్ళు ఆడవాళ్ళు కారా? ఆడదంటే ఏమిటి-? ఒక ఫ్రేమ్‌లో తను బిగించుకున్న చిత్రమా? ఆ బిగింపులో యిమడనిది ఆడది కాదనుకుంటున్నాడా?

''జీవితాంతం... యీ రాత్రి... జీవితాంతం... యీ రాత్రి-'' శేఖరం రెండు మూడుసార్లు గొణుక్కున్నాడు.

''నాకు... నాకు కావల్సింది - నమ్మకం! నా మీద నాకు నమ్మకం!'' అంటూ ఏడవసాగాడు. అతను చంటిబిడ్డలా ఏడుస్తూంటే- ఆమె విచలిత హృదయంతో - అప్రయత్నంగా లేచి - కళ్ళ ఎదురుగా తోటివాడికి జరుగుతున్న ప్రమాదానికి అసంకల్పితంగా స్పందించే మానవ ప్రవృత్తితో అతన్ని సమీపించింది. కరుణతో అతని భుజాల మీద చేతులు వేసి దగ్గరకు తీసుకుంది.

ఆమె దగ్గరకు తీసుకోగానే అతని దుఃఖం మరింతయింది. దుఃఖిస్తూనే మధ్య మధ్యలో అనసాగాడు-

''- నేను - అనేది ఏమిటి? నేను ఎవరిని? నేను గతాన్నా? వర్తమానాన్నా? గతంలోని నాకు వర్తమానంలో నాకు సంబంధం ఏమిటి? గత స్వప్నాల వైఫల్యాలేనా వర్తమాన దుఃఖాలు! సాధించినదంతా అర్థం లేనిదనీ - సాధించలేకపోయినదే - అర్థపూరితమనీ - ఎందుకనిపిస్తోంది? ఏమిటి నేను - ఏమిటి నా నేరం-''

అతనలా అంతన పొంతన లేని మాటలంటూ మధ్యలో ఆమెని విడిచిపెట్టి మంచం మీద పడుకున్నాడు. ఆ వ్యక్తి శరీరమంతా దుఃఖంతో కదిలిపోతూంది.

కరుణ అతని పక్కనే కూర్చుని, వీపు మీద రాస్తూ, మధ్య మధ్యలో మృదువుగా తడుతోంది.

కొంతసేపటికి దుఃఖం సర్దుకొంది. శేఖరం గబగబా పోయి బాత్రూం తలుపు మూసుకున్నాడు.

కరుణ మంచం మీద వాలి కళ్ళార్పకుండా పైకి చూస్తోంది.

శేఖరం వచ్చి - ''మన్నించండి- మీరు వెళ్ళే ఏర్పాటు చేస్తాను. వెళ్ళిపోండి'' అన్నాడు.

కరుణ అతన్ని పట్టి పట్టి చూస్తూ ''వెళ్ళిపోమంటారా?'' అంది.

శేఖరం జవాబివ్వలేదు.

''మీకు నా నుంచి ఏం కావాలి?''

''అర్థం చేసుకోగలరా?''

''ప్రయత్నిస్తాను. కాని... డొంక తిరుగుడు వద్దు-''

''నమ్మకం. నా మీద నాకు నమ్మకం''

''ఎందులో-?''

''సెక్సు-'' అంటున్నపుడు శేఖరం తలొంచుకుని, తర్వాత ఆమెను పరిశీలించాడు.

కరుణ మామూలుగా వుంది.

''మీకు ఈ రాత్రి నా శరీరం కావాలి'' అంది.

''కాదు. కానేకాదు. మీ కరుణ కావాలి. అటో యిటో తేలిపోవాలి. నేనేమిటో మీరు తేల్చాలి. ఇది ఈరోజు - కాదు యీ రాత్రి - కాదు యీ క్షణంలో ముగిసిపోవాలి-''

కరుణ తల పంకించుతూ అంది.

''మీరు చంటి పిల్లాడిలా అనిపిస్తున్నారు-''

''నేను నటించాను. దుఃఖాన్ని ప్రదర్శించాను. మిమ్మల్ని వంచించాను. అయినా చంటి పిల్లాడిలా కనిపిస్తున్నానా?''

''అవును! అలాగే కనిపిస్తున్నారు-''

పరుగులు తీస్తున్న మబ్బు కొండకి తగిలి వర్షిస్తున్నట్లు శేఖరం నుంచి మాటలు వర్షిస్తున్నాయి.

''కరుణా - చెప్పు, నిజం చెప్పు. మగవాడినైనంత మాత్రాన - అర్ధరాత్రి వేళ యిలాంటి కోరిక కోరినంత మాత్రాన - అందుకోసం యింత నాటకమాడినంత మాత్రాన - నేను మనిషిని కాదా? నాది దుఃఖం కాదా? తెలిసీ తెలియని వయసులో - నన్ను బిడ్డలా చూడాల్సిన వదిన - నన్ను ప్రలోభపరిచి, నేనెందుకూ పనికిరానని అనేసి - నా జీవితమంతా చల్లారని ఒక అగ్ని ముట్టించి నన్ను దహించుతూంటే - అది బాధ కాదూ? ఉత్తమ సిద్ధాంతాలను ఎంచుకుని, ఉన్నత లక్ష్యాలుగా భావించి అనుసరించి జీవించబోతే - అలా జీవించబోటానికి కారణం నా వ్యక్తిగత వైఫల్యమనీ, వ్యక్తిత్వ లోపమనీ అనిపించి, అందులో యిమడలేక, దాన్ని నాలో యిముడ్చుకోలేక పారిపోయి వచ్చిన నేనేమిటి? పరాజితుడినా? ద్రోహినా? కరుణా - చెప్పు. జీవితంలో యిర్వై ఏళ్ళకు పైగా నేను అనుభవిస్తున్నదేమిటి? నా ప్రమేయం లేకుండానే రాజ్యం నన్నెందుకు వశపరుచుకుంది? నా కెందుకు ఆశలు కల్పించింది? నాలో ఉత్తమాంశలకు ఆలంబన అవుతానని ఆశ పెట్టిన రాజ్యం నన్ను పనికిమాలిన వాడినని అనేసి - చేసింది హింస కాదా? నేనే ఒక వేదనగా గుర్తించి, మన్నించి కవిత్వంలో పలకలేకపోయినది - చెప్పు కరుణా - కరుణతో ఆలోచించి చెప్పు - అది వేదనే కాదా? నా వద్ద పడుకున్న స్త్రీలు - ఏవో ప్రయోజనాల కోసం పలికే మాటలు - చిలక పలుకుల్లా అన్పించి - వారి దైన్యం లోభం చూడకుండా ఉండలేక - వారిని ద్వేషించలేక - ప్రశ్నలు వేసి, వేసి హింసించే యీ హృదయం నా ఒక్కరికే ప్రత్యేకమయినదో - నాలా ఎందరికో సామాన్యమయినదో తెలియక - నేను పడుతున్న దాన్ని - వేదన, దుఃఖం, బాధ - అనొచ్చా కరుణా? ఇది కడుపు నిండి, ఉత్తమ జీవిత లక్ష్యాలు లేక, ఒక మగవాడినైనందువల్ల - పెరుగుతున్న ఉన్మత్త కామవాంఛే అని నిందించే, సణిగే నా హృదయం ఆరోపణ సత్యమా? ఇది వేదనే అయితే-''

అంటూ ఆగి, కరుణలో ఏదో వెదుక్కుంటూ-

''దీనికి నా కర్తృత్వమెంత? వదిన, రాజ్యాల బాధ్యత ఎంత? సామాజిక గమనాన్ని సుగమం చేయటానికి పుట్టించబడ్డాయని చెప్పబడే - లైంగిక నీతి నియమాల పాత్ర ఎంత?''

కరుణ అతను చెప్పినదంతా శ్రద్ధగా విని అతనింకేం మాట్లాడకపోవడంతో - ''అయిపోయిందా - ఇంకేమయినా చెప్పాలనుందా-?'' అంది.

శేఖరం అయోమయంగా బుర్ర ఆడించాడు.

''- టీ తెప్పించుకుంటాను - మీకు టీ కావాలా? కాఫీయా?'' అంటూ రూమ్ సర్వీస్‌కి ఫోన్ చేసింది.

''కాఫీ-'' అన్నాడు శేఖరం.

కరుణ మంచం మీద పడుకుని అతన్నే చూస్తోంది.

అతను ఆమెను చూడటం లేదు.

కాఫీ, టీ వచ్చాయి. అవి ముగిసాక, కరుణ అంది -

''నేను నిజాయితీగా చెపుతున్నాను. మీది వేదనే! నాకు ఎలాంటి సందేహమూ లేదు. - అది ఎంతటి వేదనో తూచాలంటే - దేనికన్నా మించిన బాధో - దేనికన్న పనికిమాలిన

బాధో తేల్చాలంటే - నేను తగను.

- కారణం నాకారకమైన వేదనతో నామమాత్రపు పరిచయం కూడా లేదు.

ఇప్పుడు నేను కొత్తగా తెలుసుకున్నదొకటుంది.

ఆడవాళ్ళను అణిచి వుంచటానికి మగవాడు తయారుచేసిన చట్రమే లైంగిక నీతి అని నేను నమ్మాను. ఇంకా నమ్ముతున్నాను. అయితే - ఆ నమ్మకంతో - చూపుతో - ఆ చట్రంతో - ఆ చట్రం ఎంత హృదయరహితమైనదో చూడగలిగిన నేను - మగవాడి లైంగిక సమస్యల పట్ల, వ్యక్తిగత సమస్యల పట్ల మాత్రం ఎంత హృదయ రహితంగా వున్నానో అర్థం చేసుకోగలుగుతున్నాను. ఇది అంగీకరించటానికి నేనేం వెనకాడను.

ఈ క్షణంలో అనిపిస్తున్నదేంటంటే - కొందరు హృదయమున్నవాళ్ళు తమ చుట్టూ వున్న సమస్యలకి స్పందించి, ఆ బాధలు పరిహరించటానికే తమ బుద్ధికి తోచిన పరిష్కారాలు చేసి వుంటారేమో! అవి కాలగతిలో నియమాలయి హృదయ రహితంగా తయారయాయేమో! ఏమో - హృదయ రాహిత్యం అనేది నియమాలకు చుట్టుకొన్నట్టే ఆ నియమాల మీద తిరగబడే దీక్షకు కూడా చుట్టుకుంటుందేమో!''

- అంటూ ఆగింది.

''శేఖరం గారూ! నాకు జీవితంలో పోరాట విలువలు తప్ప మరేవీ విలువలుగా కనిపించవు. పల్లెటూరిలో పుట్టాను. అయిదో తరగతి పూర్తవగానే - మా నాన్న నన్ను స్కూలు మాన్పించాడు. గొడ్లు కాయమన్నాడు. నా అన్నను హైస్కూల్లో వేసాడు. పశువులను తోలుకుంటూ, పేడకడులు ఎత్తుకుంటూ, పిడకలు చేసుకుంటూ ఇంట్లో నా వయసుకి మించిన పని మీద వేస్తూంటే - వెళ్ళబోయే యింటికి పనికి వచ్చే యంత్రంగా నన్ను మారుస్తూంటే - నేను తిరగబడ్డాను. ఇల్లు వదిలి పారిపోయాను. ఎలా చదువుకున్నానో - నా అనుభవాలేమిటో - క్లుప్తంగా చెప్పలేను. నన్ను గురించి చచ్చానని చెప్పుకున్న తల్లిదండ్రులే నేను డిగ్రీ పాసయి, బి.ఎడ్ చేసి, స్కూల్లో ఉద్యోగంలో కుదురుకొని నా బ్రతుకు నేను బ్రతుకుతూంటే - వచ్చి - నా జీవిత కళ్ళాలను స్వీకరిస్తామన్నారు. వారిని తరిమి కొట్టాను. నా చదువు - 'నాదే' అనీ, దాని మీద వచ్చే ప్రతిఫలం 'నాదే' అనే భావనతో పోరాడి- జీవితానికి ఎప్పటికప్పుడు లక్ష్యాలు ఏర్పరుచుకుంటూ జీవించాను. ఆ లక్ష్యాలన్నీ పరిస్థితులతో పోరాటం వల్ల ఏర్పడినవే! నేను నా చుట్టూ వ్యాప్తిచేసే భావజాలమంతా పోరాట విలువల మీద ఆధారపడినదే!

సామాజిక విషయాలే వ్యక్తిగత విషయాలుగా మారిపోయిన మనిషిని నేను. ఇది కేవలం నా అనుభవం. అందుకే సామాజికాంశాలు వ్యక్తిగతాంశాలుగా మారిన కవి నుంచే బలమైన కవిత్వం వస్తుందని నేను అనుకున్నాను. సామాజికాంశాలకీ, వ్యక్తిగతాంశాలకీ సరిహద్దులు చెరిపెయ్యగలిగినది నిరంతర పోరాటం మాత్రమే - అని నేను స్పష్టంగా నమ్ముతున్నాను.

''అయినా - మీది వేదన అని, మీ వ్యక్తిగత వేదన మీ కవిత్వానికి వస్తువు కాలేకపోయిందనీ - ఒప్పుకోవటానికి నాకెలాంటి అభ్యంతరమూ లేదు.

''ఇంతకీ-'' అంటూ ఆగి, ''మీకు నమ్మకం కలిగించటానికి నన్నే ఎందుకు

ఎంచుకున్నారు?''

''ఆ విషయం వదిలేయండి-''

''కాదు, నాకు తెలుసుకోవాలని వుంది-''

''చెప్పాను గదా - స్పృహ!''

''వ్యక్తిగా మారిన స్త్రీ'' అంది కరుణ.

శేఖరం మాట్లాడలేదు.

''-మీరు మీ అభిప్రాయాన్ని బలంగా నమ్ముతున్నట్లున్నారు-''

''-అవును! అటువంటి స్త్రీ మాత్రమే ఏ ప్రయోజనాలూ ఆశించకుండా - నా మీద కరుణతో - నా లైంగిక శక్తి మీద సత్యం చెప్పగలదు-''

''మీరు సీరియస్‌గా అంటున్నారా?''

''మీకలా అనిపించటం లేదా?''

కరుణ ఆలోచించుతూ అంది -

''మీరంత సీరియస్‌గా భావిస్తే - నాదో ప్రశ్న-''

''అడగండి-''

''స్త్రీలలో ఎందరు తమ సెక్సు స్పందనలను గమనించి భయపడకుండా వుంటారు? తమ ఆనందమిదీ, తమ అవసరం యిదీ అని మగవాడిని అడగగలుగుతారు? ఆ మగవాడు భర్త అయినా, విటుడు అయినా, స్నేహితుడయినా ఎవరయినా సరే - స్వేచ్ఛ ప్రదర్శించగలుగుతారా? ఎవరయినా కొందరు ప్రదర్శించితే మగవాడు దాన్ని ఎలా తీసుకుంటాడు? శేఖరం! మగ ప్రపంచం తయారుచేసిన వైద్య శాస్త్రాలు దానిలో 'మానసిక రోగాలను' చూడగలుగుతాయి, చూపగల్గుతాయి గాని, శాస్త్రీయంగా సత్యం చెప్పగలవా? స్టాటిస్టిక్స్ ఆధారంతో సత్యం తెలుసుకోవచ్చని భ్రమించే పాశ్చాత్యుల ప్రయత్నాలలో మాత్రం ఎంత శాస్త్రీయత ఉంది? చెప్పగలరా?'' అంది.

శేఖరం ఆలోచనలో పడ్డాడు.

''మీరంటూన్న వ్యక్తిగా మారినా, మారలేకపోయినా మీరు తెలుసుకోవాలనుకుంటున్న సత్యాన్ని తేల్చి చెప్పాలనే కుతూహలం నాకూ వుంది. దురదృష్టవశాత్తూ-'' అంటూ ఆగి.

''శంకరాచార్యుడిని కామశాస్త్రంలో చర్చించమందిట ఒక పండితురాలు. నాకు తెలియని శాస్త్రం అన్నాడుట ఆయన. అలాగే నేను కూడా లైంగికానుభవమే ఎరగనిదాన్ని. ప్రాథమిక జ్ఞానం లేనిదాన్ని, పరీక్షలు ఎలా నిర్వహించగలను?'' అంది నవ్వుతూ.

''నిజంగానా?'' అన్నాడు అప్రయత్నంగా.

''మీరిలా ఆశ్చర్యపోతారని నాకు ముందే తెలుసు. లైంగిక నీతి వద్దని యుద్ధం చేసే ఫెమినిస్టులు - తమ శారీరకానందం కోసమే. తమ కొవ్వు కరగటం కోసమే అలా కూస్తున్నారని - విప్లవ భావాలతో తమని తాము ముడేసుకునేవారే - బల్ల గుద్ది మరీ చెపుతున్నారు. మీ ఆశ్చర్యమూ ఆ కోవకి చెందినదే-''

''క్షమించండి - నా ఉద్దేశ్యం-''

''అదేమంత క్షమించరాని ఆశ్చర్యం కాదులెండి - మగవాడిననే స్పృహ నుంచి వ్యక్తిగా మారగలిగిన వాడే - అలా ఆశ్చర్యపోడు-''

''మీరన్నది నిజమే - ఓ విషయం చెప్పనా?''

''డొంక తిరుగుడు మాత్రం వద్దు-''

''మీరు మరింత అందంగా, ఆకర్షణీయంగా, కోరదగ్గవారుగా అనిపిస్తున్నారు.''

కరుణ నవ్వింది.

''ఎందుకనిపించనూ! లైంగిక విషయాల మీద ఉపన్యాసాలు దంచి - పవిత్రంగా వుండగలిగిన ఆడదాన్ని గదా-''

శేఖరం ఆమె నవ్వులో నవ్వు కలిపాడు.

కానీ,

ఆ నవ్వుల వెనుక ---

*(రచన - ఫిబ్రవరి 99)*